# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :274 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 09-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## కుంభమేళాకు బయలుదేరిన శ్రీవారి కళ్యాణ రథం

తిరుమల : జనవరి 13న ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో మహా కుంభమేళా ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుమల నుండి బుధవారం ఉదయం శ్రీవారి కళ్యాణ రథం బయలుదేరింది. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి రథానికి మేళతాళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పచ్చ జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ జనవరి 13నుంచి ఫిబ్రవరి 26వరకు జరగనున్న కుంభమేళాలో సెక్టార్ 6, భజరంగ్ దాస్ రోడ్డులోని నాగ వాసుకి దేవాలయం సమీపంలో యూపీ ప్రభుత్వం కేటాయించిన 2.89 ఎకరాల స్థలంలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. 170 మంది సిబ్బందితో నమూనా ఆలయంలో తిరుమల తరహాలో అన్ని కైంకర్యాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉత్తరాది భక్తులకు స్వామి వారి అర్జిత సేవలను తిలకించే భాగ్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.జనవరి 18, 26 తేదీల్లో ఫిబ్రవరి 3, 12 తేదీల్లో 4సార్లు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

## కేటీఆర్ అరెస్ట్ అయితే.. పార్టీని నడిపించేది వీళ్లేనా?



హైదరాబాద్,కేటీఆర్ అరెస్ట్ అయితే.. పార్టీని ఎవరు నడిపిస్తారన్న ప్రశ్న వినిపించిన ప్రతీసారి.. చాలాపేర్లు తెరమీదకు వస్తున్నాయ్. ఐతే అందులో ఎవరికి అవకాశం దక్కుతుందన్నదే ఇప్పుడు కనిపిస్తున్న చర్చ.. గులాబీ శ్రేణులు ఏమనుకుంటున్నాయా.. గులాబీ బాస్ రంగంలోకి దిగుతారా.. వింటేజ్ కేసీఆర్‌ను పరిచయం చేస్తారా.. లేదంటే హరీష్, కవితలో ఒకరు బాధ్యత తీసుకుంటారా.. ఇదే ఇప్పుడు వినిపిస్తున్న చర్చ..

పొలిటికల్‌గా యాక్టివ్ అవుతున్నహరీశ్

ఎదురుదెబ్బల నుంచి బలంగా తిరిగివస్తా అంటూ కేటీఆర్ చేసిన ఓ ట్వీట్.. కొత్త చర్చకు కారణం అవుతోంది. అరెస్ట్ ఖాయమని ఆయన డిసైడ్ అయిపోయారని కొందరు అంటుంటే.. రేవంత్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయ్. ఆ ట్వీటే ఇప్పుడు కేటీఆర్ అరెస్ట్ గురించి.. ఆ తర్వాత పార్టీ నాయకత్వం గురించి చర్చకు కారణం అవుతోంది. కేటీఆర్ అరెస్ట్ అయినా.. బీఆర్ఎస్‌కు నాయకత్వ సమస్య లేదు అన్నది కొందరి వాదన. నిర్మాణాత్మకమైన కేడర్ లేకపోయినా.. బలమైన నాయకులు ఉండడం పార్టీకి కలిసొచ్చే అంశం.నాయకత్వ బాధ్యతలు తీసుకునేందుకు హరీష్, కవిత సిద్ధంగా ఉన్నా.. కేసీఆర్ ఎవరి వైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి కనిపిస్తోంది. గ్రౌండ్‌లెవల్‌లో పార్టీ కేడర్‌తో హరీష్‌కు మంచి సంబంధాలు ఉన్నాయ్.. పైగా ఇప్పుడు కవిత కూడా పొలిటికల్‌గా యాక్టివ్ అవుతున్నారు. దీంతో గులాబీ శ్రేణుల్లో కొత్త చర్చ మొదలైంది.

క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవాలంటే..

ఏసీబీ కేసులో ఒకవేళ కేటీఆర్ అరెస్ట్ అయితే.. ఎప్పుడు బెయిల్ దొరుకుతుందో చెప్పలేని పరిస్థితి. ప్రభుత్వ తీరు చూస్తుంటే.. అంత ఈజీగా బెయిల్ దక్కదన్న అనుమానాలు గులాబీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాబోయే రోజులు.. పార్టీకి కీలకం అనే చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్కార్ సిద్ధం అవుతోంది. దీంతో రాబోయే రోజుల్లో మరింత అలర్ట్ అవ్వాల్సిన అవసరం ఉంది.కేటీఆర్ అరెస్ట్ అయితే.. ఆ ప్రభావం పార్టీ కేడర్ మీద పడే చాన్స్ ఉంటుంది. వీటిని అధిగమిస్తూ ప్రతిపక్షపార్టీగా.. క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను దక్కించుకోవాల్సి ఉంటుంది. దీంతో ఇప్పుడు పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో.. పార్టీని ఎవరు నడిపిస్తారన్నది గులాబీ నేతలకు గుబులు పుట్టిస్తున్న పరిస్థితి.

తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలు..

ఎమ్మెల్సీ కవిత.. పార్టీ బాధ్యతల్లో మరింత చురుగ్గా మారే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన కవిత.. దాదాపు ఆరు నెలల తర్వాత రిలీజ్ అయ్యారు. విడుదలైనప్పటి నుంచి.. రాజకీయంగా యాక్టివ్ అయేందుకు ఏ అవకాశం దక్కినా.. వదులుకోవడం లేదు. ఓవైపు తెలంగాణ జాగృతి పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూనే%ఔ%. కుల సంఘాల నేతలతో సమావేశం అవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తూ పార్టీ కేడర్‌కు దగ్గరయ్యే కార్యాచరణ అమలు చేస్తున్నారు. ప్రభుత్వ వైఖరి ఎండగట్టేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. రెండు, మూడు నెలలుగా రాజకీయాల్లో.. కవిత తన మార్క్ క్రియేట్ చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతారా..?

ఇక కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి కావడంతో.. కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయ్. ఇక అటు అరెస్ట్ తప్పదన్న అంచనాలతో.. కేడర్‌ను మానసికంగా సిద్ధం చేసే పనిలో పడ్డారు కేటీఆర్. కక్షతో ప్రభుత్వం తనను అరెస్ట్ చేసేందుకు సిద్ధం అవుతోందని.. నేతలు మానసిక ధైర్యం కోల్పోవద్దని సూచిస్తున్నారు. ఇకపై అధినేత కేసిఆర్.. నేతలకు, కార్యకర్తలకు నేరుగా సూచనలు చేస్తారని.. తనను కలిసి నేతలతో కేటీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగే అవకాశం ఉందనే ప్రచారం ఊపందుకుంది. మొత్తం మీద కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత వ్యవహారం.. పార్టీలో ఎన్నో చర్చకు కారణం అవుతోంది. మరి ఏం జరుగుతుంది.. అరెస్ట్ అవుతారా.. అయితే పార్టీని నడిపించేంది ఎవరని తెలియాలంటే.. కాలమే సమాధానం చెప్పాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్.

## ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ తన అసలు రంగు బయటపెట్టింది..

హైదరాబాద్,ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్) పేరిట 15 వేల కోట్లు ప్రజల ముక్కు పిండి వసూలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ రెండు నాలుకల ధోరణికి ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పైన నాడు అడ్డగోలుగా విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి రాగానే అసలు రంగు బయటపెట్టిందని విమర్శించారు.“డబ్బులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎల్ఆర్ఎస్ పేరిట డబ్బులు దండుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మేము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేస్తా”మని గతంలో కాంగ్రెస్ నేతలు మాటలు చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ కోసం రెండు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల నుంచి సొమ్మును దండుకునే కార్యక్రమానికి తెర లేపడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.రియల్ ఎస్టేట్ త్వరలో పుంజుకుంటుందని స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడం అంటే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందనే కదా అర్థమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన వల్ల రియల్ ఎస్టేట్ కుదేలైందని మేం ముందు నుంచే చెప్తుంటే బుకాయిస్తున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారని నిలదీశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దాడులు చేయడం మానేసి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. దారి తప్పిన పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేయండని సూచించారు.

రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు సెటైర్లు

హైదరాబాద్, హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మీ పాలనలో ప్రజల ప్రాణాలు కాపాడిన పోలీసుల జీవితాలకే ‘భద్రత’ లేకుండా పోవడం సిగ్గు చేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రిటైర్డ్ పోలీసు ఉద్యోగి సాధిక్ అలీ 8 నెలల నుంచి తనకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నానని, ఇక అతహత్యే శరణ్యం అంటూ ఆవేదన చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండి పడ్డారు.కాంగ్రెస్ పాలన అన్ని వర్గాలతో పాటు రిటైర్మెంట్ ఉద్యోగులకు కూడా



శాపంగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపే రోజుల్లో వారిని మానసిక క్షోభకు గురి చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. దాదాపు 7,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు వారికి హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే గాని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేని దుస్థితికి విశ్రాంత ఉద్యోగులను నెట్టడం శోచనీయమని విమర్శించారు.మరోవైపు నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించక ఉద్యోగులకు, జర్నలిస్టులకు, పోలీసులకు వైద్యం అందించే ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్, ఆరోగ్య భద్రత పథకాలను సేవలను సైతం అటకెక్కించే పరిస్థితి కల్పించారని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు. అత్యవసర వైద్య సేవలు అందకుండా చేశారని అన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వెంటనే బకాయిలు చెల్లించి, ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీసులకు వైద్య సేవలు కొనసాగేలా చూడాలని, రిటైర్మెంట్ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విజయవంతంగా ఉద్యోగాలు పూర్తిచేసి, జీవితంలో విజయం సాధించిన మీ సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కావని సూచించారు. పోరాడి పరిష్కారం చేసుకుందాం.. మీకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

## కాంగ్రెస్ వాగ్దానం చేసిన భద్రత ఎక్కడ ఉంది?



హైదరాబాద్,కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. “ఏఐసీసీ ఫేక్ న్యూస్ పెడ్లర్లతో నిండిపోయింది. తెలంగాణ మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా పొందలేదు.మహిళలకు సాధికారత కల్పించడానికి బదులుగా వారిని చితకబాదారు.ఇళ్లను పడగొట్టడం, కూరగాయల వ్యాపారులను లక్ష్యంగా చేసుకున్నారు. గర్భిణీ స్త్రీలను వీధుల్లోకి నెట్టారు. ఇది పాలన కాదు ఇది మహిళలపై వ్యవస్థీకృత క్రూరత్వం. తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది వినాశకరమైన పాలనలో రేప్ కేసులు 28.94%, మహిళల హత్యలు 13%పెరిగాయి. కిడ్నాప్‌లు, అపహరణలు 26% పెరిగాయి. కాంగ్రెస్ వాగ్దానం చేసిన భద్రత ఎక్కడ ఉంది? మహిళల ప్రాథమిక గౌరవం కూడా దాడికి గురవుతోంది. కాంగ్రెస్ హయాంలో 10,000 మంది మహిళలు బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు గురయ్యారు. కాంగ్రెస్ దోపిడీ దారుల, విధ్వంసకారుల, అబద్ధాల పార్టీగా మారింది.” అని విమర్శించారు.ఇదిలా ఉండగా.. బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముందు నిన్న తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ బీజేపీ కార్యకర్తలు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బీజేపీ కార్యాలయం ముట్టడికి వచ్చిన యూత్ కాంగ్రెస్ నాయకులపై బీజేపీ ఎదురు దాడికి దిగింది. బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్ళు విసిరారు. బీజేపీ కార్యకర్తలు కర్రలు పట్టుకొని బయటకు వచ్చారు. బీజేపీ కార్యాలయం లోపలికి రాళ్ళు విసరడంతో ఒక దళిత మోర్చా కార్యకర్త తలకి గాయాలయ్యాయి. ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమని బీజేపీ ఆరోపిస్తోంది. ఇక్కడ వరకు ఎలా రానిచ్చారు అని ప్రశ్నించింది. ఇదిలా ఉండగా.. బీజేపీ సీనియర్ నేత రమేష్ బిదూరి.. ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో కాంగ్రెస్ బీజేపీ కార్యాలయం ముట్టడికి పిలుపు నిచ్చింది. ఇక్కడ ఈ ఘటన చోటుచేసుకుంది.

## ఆ పేరుకు కళంకం తేవడం నాకు ఇష్టం లేదు...

తమిళనాడు : అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై ఉగ్ర దాడి ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ ఒక్కసారి అడ్డంపెట్టుకుని కొందరు సభ్యులు మాటిమాటికి అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన దారుణం ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని.‘సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను ఆ యూనివర్సిటీ పేరును ప్రస్తావించుకోలేదు. నేను ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. ఎందుకంటే ఈ సభలో ఉన్నవారిలో చాలామందిని తయారు చేసింది ఆయనే. ఆ భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించలేదు. విద్యార్థినిపై దాడి చేసిన చర్య’ అని స్టాలిన్‘సభలోని సభ్యులంతా దాడి ఘటనపై మాట్లాడారు. ఒక్కరు తప్ప అందరూ నిజమైన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని చెడుగా చూపించడమే ఆ ఒక్క సభ్యుడి పని. కానీ నేను ఒక్కటే చెబుతున్నా. మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగిన ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా



విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే’ అని స్టాలిన్.అన్నా యూనివర్సిటీలో ఇటీవల 19 ఏళ్ల విద్యార్థినిపై గణశేఖరన్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు క్యాంపస్ భవనం వెనుకాల తన స్నేహితుడితో మాట్లాడుతుండగా నిందితుడు చూశాడు.ఆమె స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై ఉల్లాసంగా దాడి చేశాడు. ఘటనపై విద్యార్థిని తన స్నేహితునితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

## బిగ్ షాక్ .. హైదరాబాద్‌లో 11 హెచ్ఎంపీవీ వైరస్ కేసులు


హైదరాబాద్,చైనాను వణికుస్తున్న హెచ్ఎంపీవీ వైరస్ ఇండియాలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రలలో కేసులు వెలుగులోకి వచ్చాయి.వీటికంటే ముందే హైదరాబాద్ లో 11 హెచ్ఎంపీవీ వైరస్ కేసులు నమోదు కావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అవును... ఈ విషయాన్ని ఓ ప్రైవేటు ల్యాబ్ వెల్లడించింది. 258 మందికి శ్వాసకోశ వైద్య పరీక్షలు చేయగా... అందులో 11 మంది శాంపిల్స్ లలో హెచ్ఎంపీవీ వైరస్ పాజిటివ్ గా వచ్చిందని తెలిపింది.

డిసెంబర్ నెలలో..

2024 డిసెంబర్ నెలలో పలువురు వైరల్ ఇన్ఫెక్షన్లతో బాధపడుతుడుతూ.. హైదరాబాద్లోని మణి మైక్రోబయాలజికల్ ల్యాబోరేటరీకి వచ్చారు. ఇక్కడ 258 మందికి శ్వాస కోశ వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఇందులో 11 మందికి పాజిటివ్ గా తేలింది. ఇక 94 శాంపిల్స్ బ్యాక్టీరియల్ న్యూమోనియా, 62 రినో వైరస్, 33 అడెనో వైరస్ కేసులు ఉన్నట్లుగా వెల్లడించింది. ఇక 9 కేసుల్లో ఇన్ఫ్లుయెంజా, ఒక వ్యక్తికి హెచ్1ఎన్1 వైరస్ సోకినట్లుగా ప్రైవేటు ల్యాబ్ స్పష్టం చేసింది. అయితే హెచ్ఎంపీవీ వైరస్ సోకిన వారంతా డిశ్చార్జ్ అయినట్లుగా చెప్పింది.అయితే హెచ్ఎంపీవీ వైరస్ కొత్తదేం కాదని దీని గురించి ప్రజలు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదంటూ ఇప్పటికే భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ప్రకటించింది. సుదీర్ఘ కాలంగా హెచ్ఎంపీవీ వైరస్ ఇండియాలో ఉన్నట్లుగా వెల్లడించింది.

HMPV లక్షణాలు ఇవే

ఈ హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ సాధారణంగా ఫ్లూ లేదా జలుబు లక్షణాలు కలిగి ఉంటుంది. ఈ వైరస్ ఉన్నవారు దగ్గిన, తుమ్మిన, శారీరక సంబంధాల ద్వారా ఇతరులకు సోకుతుంది. మొదట దగ్గు, కొద్దిపాటి జ్వరం వస్తుంది. ఆ తర్వాత జలుబు, గొంతు నొప్పి, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలన్నీ కూడా కనిపిస్తాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఈ వైరస్ బారిన పడతారు. ఈ వైరస్ రాకుండా ఉండాలంటే ముఖ్యంగా శు



భ్రత పాటించాలి. దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు క్లాత్ అడ్డంగా పెట్టుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు ముఖానికి మాస్క్ ధరించాలి.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు



న్యూఢిల్లీ,జనవరి 8: కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ. 1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

### ముఖ్యమైన సవాళ్లలో జనాభా తగ్గుదల ఒకటి : ఎలాన్ మస్క్

న్యూఢిల్లీ, ప్రపంచ వ్యాప్తంగా జనాభా తగ్గుదలపై అపరకుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సవాళ్లలో ఇది ఒకటిగా పేర్కొన్నారు. జనాభా క్షీణతకు సంబంధించిన ఓ గ్రాఫ్‌ను టెస్లా ఓనర్స్ సిలికాన్ వ్యాలీ ఎక్స్‌లో పోస్టు చేసింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్, చైనా సహా నైజీరియా, అమెరికా, ఇండోనేషియా, పాకిస్థాన్ వంటి కీలక దేశాల్లో 2018 నుంచి 2100 మధ్య జనాభాలో ఎలాంటి మార్పులు ఉండనున్నాయనే దాన్ని ఈ గ్రాఫ్‌లో చూపించారు. ముఖ్యంగా భారత్, చైనా దేశాల్లో 2100 నాటికి జనాభా క్షీణత తీవ్రంగా ఉంటుందని ఆ గ్రాఫ్‌లో అంచనా వేశారు. ఈ గ్రాఫ్‌ను పోస్టు చేసిన టెస్లా ఓనర్స్ సిలికాన్ వ్యాలీ.. ‘జనాభా తగ్గుదల మానవాళికి అత్యంత ముప్పు’ అని పేర్కొంది. ఈ ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన మస్క్.. ‘అవును’ అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## కరీంనగర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం... క్లీనర్ మృతి

కరీంనగర్, జనవరి 8: కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హుజురాబాద్ మండలం మాందాడిపల్లిలో వరంగల్ కరీంనగర్ జాతీయ రహదారిపై అదుపుతప్పి లారీ చెట్టును ఢీ కొట్టింది. ప్రమాంలో లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి డ్రైవర్‌ను స్థానికులు, ఫైర్ సిబ్బంది బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సంపాదకీయం

గురువారం 09-01-2025

# అక్రమ రుణయాప్‌లపై సర్కారీ కొరడా

నియంత్రణ లేని రుణ కార్యకలాపాలను అడ్డుకుని, రుణగ్రహీతలకు రక్షణ కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. డిజిటల్ యాప్‌ల దురాగతాలకు, ఆఫ్‌లైన్ రుణవితరణలో జరుగుతున్న అవకతవకలకు చెక్ పెట్టేందుకు కేంద్రం 'బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ లెండింగ్ యాక్టివిటీస్' ముసాయిదా బిల్లును తీసుకొచ్చింది. నియంత్రణ లేని రుణ కార్యకలాపాలను అడ్డుకుని, రుణగ్రహీతలకు రక్షణ కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. డిజిటల్ యాప్‌ల దురాగతాలకు, ఆఫ్‌లైన్ రుణవితరణలో జరుగుతున్న అవకతవకలకు చెక్ పెట్టేందుకు కేంద్రం 'బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ లెండింగ్ యాక్టివిటీస్' ముసాయిదా బిల్లును తీసుకొచ్చింది.దేశంలో అక్రమ, అనియంత్రిత రుణయాప్‌ల దందాలకు పగ్గాలు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలకు సమకట్టింది. ఇందులో భాగంగా 'బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ లెండింగ్ యాక్టివిటీస్ (బీయూఎల్ఏ)' ముసాయిదా బిల్లు తెచ్చింది. ఆర్‌బీఐ, ఇతర నియంత్రణ సంస్థల అనుమతులు లేకుండా, ఏ చట్టం కిందా నమోదుకాని వ్యక్తులు, సంస్థలు రుణ కార్యకలాపాలను చేపట్టకుండా నిరోధించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. చట్టవిరుద్ధంగా రుణయాప్‌ల ద్వారా, ఆఫ్‌లైన్‌లో రుణాలిచ్చే వ్యక్తులు, సంస్థలకు కఠిన శిక్షలు, భారీ జరిమానాలు విధించేందుకు ఈ బిల్లులో పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ముసాయిదా బిల్లు చట్టరూపం దాలిస్తే- డబ్బులు వసూలు చేసుకోవడం కోసం అనైతిక, అమానవీయ పద్ధతుల్లో రుణగ్రహీతలను వేధించేవారికి అది సింహస్వప్నం అవుతుంది.

తీవ్ర ఆర్థిక నష్టాలు

ఇటీవలి సంవత్సరాల్లో దేశంలో రుణయాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. వాటిలో కొన్ని అధికారిక, చట్టబద్ధమైన యాప్‌లు ఉంటే... మరికొన్నింటిని అనధికారిక, మోసపూరిత యాప్‌లుగా గుర్తించారు. మూడు నాలుగేళ్లుగా ఈ అక్రమ యాప్‌లు పెద్దయెత్తున వ్యక్తిగత రుణాలు అందిస్తున్నాయి. ఎలాంటి పూచీకత్తు, పత్రాలతో పెద్దగా పనిలేకుండా క్షణాల్లో రుణాలు ఇస్తుండటంతో ఈ అనధికారిక యాప్‌ల వలలో చాలామంది పేద, మధ్యతరగతి ప్రజలు చిక్కుకున్నారు. ముఖ్యంగా యువత పెద్దసంఖ్యలో వీటికి ఆకర్షితులవుతున్నారు. అప్పులపై పలు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అధిక వార్షిక వడ్డీరేట్లు (18-40శాతం) విధిస్తూ, భారీగా రుసుములను వసూలు చేస్తున్నాయి. తిరిగి డబ్బులు వసూలు చేసేటప్పుడేమో రుణగ్రహీతల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నాయి. దాంతో రుణయాప్‌ల వేధింపులకు తాళలేక ఎంతోమంది బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరోవైపు, రుణయాప్‌ల మాటున మోసపూరిత, చట్టవిరుద్ధ కార్యకలాపాలూ పేట్రేగిపోతున్నాయి. కొన్ని అక్రమ రుణయాప్‌లు డేటా చోర్యానికి పాల్పడటం ద్వారా వినియోగదారులకు తీవ్ర ఆర్థిక నష్టాలను కలిగిస్తున్నాయి. దేశ భద్రతకు ముప్పు వాటిల్లే కార్యకలాపాలకూ అవి తెగబడుతున్నాయి. ఈ నేపథ్యంలో అనధికారిక, మోసపూరిత రుణయాప్‌ల ఆగడాలను అరికట్టి రుణగ్రహీతలకు రక్షణ కల్పించేందుకు రిజర్వు బ్యాంకు 2021లో ఒక వర్కింగ్ కమిటీని నియమించింది. ఆ కమిటీ సిఫార్సుల ఆధారంగా 2022 సెప్టెంబర్‌లో రిజర్వు బ్యాంకు డిజిటల్ రుణాలపై సమగ్ర మార్గదర్శకాలను జారీచేసింది. డిజిటల్ రుణదాతలు ఇచ్చే అప్పులపై వసూలుచేసే వార్షిక వడ్డీరేట్లు, ఇతరత్రా రుసుముల వివరాలన్నీ పారదర్శకంగా రుణగ్రహీతలకు తెలియజేయాలని నిర్దేశించింది. అంతేకాకుండా, రుణ మొత్తాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలనీ, రుణగ్రహీతల సమాచారాన్ని అధికారిక సర్వర్లలోనే భద్రపరచాలనీ రిజర్వు బ్యాంకు సూచించింది. అక్రమ డిజిటల్ రుణ కార్యకలాపాల నిరోధానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్న కమిటీ సిఫార్సును ఇప్పుడు ప్రభుత్వం అమలుచేస్తోంది.అక్రమ రుణ కార్యకలాపాల నిషేధ ముసాయిదా బిల్లు చట్టరూపం దాలిస్తే- అనియంత్రిత రుణయాప్‌ ద్వారా అప్పులిచ్చే వ్యక్తులు, సంస్థలకు కఠిన శిక్షలు, జరిమానాలు తప్పవు. చట్టవిరుద్ధంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో రుణాలిచ్చే వారికి రూ. 2లక్షల నుంచి కోటి రూపాయల వరకు జరిమానాతో పాటు రెండు నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. వసూళ్ల కోసం రుణగ్రహీతలను వేధింపులకు గురిచేసినా, చట్టవిరుద్ధమైన పద్ధతులను అవలంబించినా భారీ జరిమానాలతోపాటు మూడు నుంచి పదేళ్ల వరకు కారాగార శిక్ష తప్పదు. అనియంత్రిత డిజిటల్ యాప్‌లు, ఆన్‌లైన్ రుణ వేదికల ద్వారా పదేపదే అక్రమ కార్యకలాపాలను సాగించే వారికి 5-10 ఏళ్ల జైలుశిక్ష, రూ.10లక్షల నుంచి రూ.50 కోట్ల దాకా జరిమానా విధించవచ్చు! ఈ చట్టం కింద నమోదయ్యే కేసులను నాన్-బెయిలబుల్ నేరాలుగా పరిగణిస్తారు.

అప్రమత్తతే కీలకం

చట్టబద్ధతలేని అక్రమ రుణయాప్‌ల భరతం పట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వం, రిజర్వు బ్యాంకులు పలు చర్యలు చేపట్టాయి. గతంలో ప్రభుత్వం కొన్ని అక్రమ రుణయాప్‌లను నిషేధించింది. రిజర్వు బ్యాంకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను జారీచేస్తూ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది. తాజాగా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో అత్యాధునిక సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో, అంతకంటే వేగంగా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. కాబట్టి, రుణగ్రహీతలు మరింత అప్రమత్తంగా ఉండి పూర్తి అవగాహనతో వ్యవహరించడం ఎంతైనా అవసరం. ఆన్‌లైన్ రుణాల కోసం వారు విశ్వసనీయమైన, చట్టబద్ధమైన రుణయాప్‌లనే ఎంచుకోవడం అన్నింటికంటే కీలకం.

పనిచేస్తూ...

చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడం భారతీయ యువతకు పెద్ద సమస్యగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థులు తమకు నచ్చిన రంగంలో పనిచేస్తూ నైపుణ్యాలు ఒడిసిపట్టడానికి అప్రెంటిస్‌షిప్ తోడ్పడుతుంది. దీన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రత్యేక పథకాన్ని తెచ్చింది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో దేశీయంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు 84,113 అప్రెంటిస్‌షిప్‌లు అందించాయి. ఎక్కువ సంఖ్యలో వాటిని కల్పించిన సంస్థలు ఏవంటే...

# సురక్షిత డిజిటల్ ప్రపంచం కోసం!



హైదరాబాద్,కాలం మారుతున్నకొద్దీ, సాంకేతికతలు విస్తరిస్తున్నకొద్దీ కొత్త భయాలు పుట్టుకొస్తాయి. తమ పిల్లలు సోషల్ మీడియా వ్యామోహంవల్ల చెడిపోతున్నారని కొన్నాళ్లుగా తల్లిదండ్రుల్లో బెంగ పట్టు కుంది. అక్కడ తారసపడే విశృంఖల పోకడలు, తప్పుడు భావాలు పిల్లల మెదళ్లపై దుష్ప్రభావం కలగ జేస్తున్నాయి. వారి బాల్య, కౌమార దశలను కొల్లగొడుతున్నాయి. పిల్లలకు మాదకద్రవ్యాలు అల వాటు చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కాదనలేనిది. నిజానికి సోషల్ మీడియా దుర్వ్యసనంగా మారిన వైనమూ, దాని పర్యవసానాలూ చెదురుమదురుగా కనిపిస్తూనే ఉన్నాయి. కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వచ్చినప్పుడు కొత్త తలనొప్పులు సహజమే. ఈ నేపథ్యంలో 18 ఏళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవటానికి తల్లిదండ్రుల అనుమతి తప్పని సరి చేస్తూ డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం ముసాయిదా నిబంధనలను కేంద్రం రూపొందించింది. అభ్యంతరాలు, సూచనలు వచ్చే నెల 18లోగా తెలియజేయాలని కోరింది.డేటా పరిరక్షణ కోసం, వ్యక్తిగత గోప్యత భద్రత కోసం ఒక చట్టం అవసరమన్న సంగతిని మన పాలకులు గ్రహించటంలో అలవిమాలిన జాప్యం చోటుచేసుకుంది. పౌరుల వేలిముద్రలు, బ్యాంకు ఖాతాలతో సహా సమస్త వివరాలనూ సేకరించే ఆధార్ వ్యవస్థ తీసుకొచ్చిన ఏడెనిమిదేళ్ల వరకూ ఆ డేటా పరిరక్షణకు ఎలాంటి కట్టుదిట్టాలు అవసరమన్నది ఎవరికీ తట్టలేదు. 2017లో జస్టిస్ పుట్టస్వామి పిటిషన్‌పై ఇచ్చిన తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు వ్యక్తిగత గోప్యతను తొలిసారి ప్రాథమిక హక్కుగా గుర్తించింది. మరో ఆరేళ్ల తర్వాత 2023 ఆగస్టులో డీపీడీపీ చట్టం వచ్చింది. దాని అమలుకు సంబంధించిన నిబంధనల రూపకల్పనకు మళ్లీ ఇన్ని నెలలు పట్టింది. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్న వర్త మానంలో ఈ అంశంపై ఇప్పటికైనా ముసాయిదా నిబంధనలు రావటం హర్షించదగ్గది. ప్రస్తుతం ఎటునుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని వాతావరణంలో ప్రపంచం మనుగడ సాగిస్తోంది. గోడలకు చెవులుంటాయన్నది పాత సామెత. స్మార్ట్ ఫోన్లకు చెవులే కాదు... కళ్లు కూడా ఉంటున్నాయి. మనం పక్కవారితో సాగించే పిచ్చాపాటీని సైతం వినే సదుపాయం ఆ ఫోన్లలో ఉంటున్నదని, మన ఇష్టాయిష్టాలు తెలుసుకోవటం, వాటి ఆధారంగా డేటా రూపొంది క్షణాల్లో ఎవరెవరికో చేరిపోవటం రివాజైందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఫోన్‌లు వినియోగించనప్పుడు సైతం వాటి కెమెరాలు కళ్లు తెరిచే సాంకేతికత ఉన్నదంటున్నారు. ఇలాంటి ఫోన్‌లు తెలిసీతెలియని వయసులో ఉన్న పిల్లలకు ఎంత చేటు తీసుకురాగలవో ఊహించటానికి కూడా భయం వేస్తుంది. అందువల్లే ఎప్పుడెప్పుడు తగిన నిబంధనలు వస్తాయా అని తల్లిదండ్రులు ఎదురుచూస్తు న్నారు. తమ డేటా, బ్యాంకు ఖాతాల సమాచారం బయటకెలా పోతున్నదో తెలియక పెద్దలు కంగారు పడుతుంటే సామాజిక మాధ్యమాల్లో దుండగుల బారినపడి పిల్లలు తల్లడిల్లు తున్నారు. వినియోగదారుల డేటా సేకరణలో పారదర్శకతనూ, ఎందుకోసం సేకరిస్తున్నారో వెల్ల డించటాన్నీ నిబంధనలు తప్పనిసరి చేస్తున్నాయి. ఒకవేళ సంస్థల అజాగ్రత్త వల్ల లేదా ఉద్దేశపూర్వక చర్యవల్ల డేటా లీకైతే ఫిర్యాదు చేయటానికి కూడా ఏర్పాట్లున్నాయి. అలాగే సంస్థల్లో డేటా సేకర ణకు అనుసరిస్తున్న విధానాలను సవాలు చేయటానికి, వివరణ కోరటానికి అవకాశం ఉంది. నిబంధనల అమలును పర్యవేక్షించటానికి ప్రభుత్వం డేటా పరిరక్షణ బోర్డు (డీపీబీ) ఏర్పాటు చేస్తుంది. ఇదిగాక ప్రతి సంస్థా తమ ఖాతాదార్ల గోప్యత దెబ్బతినకుండా చూసేందుకు, వినియోగదారుల నుంచి అవసరమైన అనుమతులు పొందేందుకు డేటా పరిరక్షణ ప్రత్యేక అధికారిని నియమించు కోవటం, నిఘా పెట్టడం తప్పనిసరవుతుంది. డేటా లీక్‌ను అరికట్టడంలో విఫలమయ్యే సంస్థకు రూ. 250 కోట్ల వరకూ జరిమానా విధిస్తారు. మొత్తంగా మనం పౌరుల డేటా పరిరక్షణలో వెనకబడినట్టే, సామాజిక మాధ్యమాల దుష్ప్ర భావాల నుంచి పిల్లల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్న విషయంలోనూ వెనకబడ్డాం. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల్లో 137 దేశాలు చాన్నాళ్ల క్రితమే డేటా పరిరక్షణ చట్టాలు తెచ్చాయి. అమెరికాలో పదమూడేళ్లలోపు పిల్లలు ఆన్‌లైన్ వీక్షణపై కఠిన నిబంధనలున్నాయి. యూరప్‌లో పదహారేళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రుల అనుమతి అవసరం. ఆస్ట్రేలియా సామాజిక మాధ్యమాల్లో పదహారేళ్లలోపు పిల్లల ప్రవేశంపై ఇటీవలే పూర్తి నిషేధం విధించింది. మన దేశంలో లేదుగానీ... టిక్‌టాక్ వల్ల విదేశాల్లో ఎన్నో సమస్యలొస్తున్నాయి. టీనేజ్ పిల్లల్లో 58 శాతంమంది దాన్ని చూస్తు న్నారని ఒక సర్వే చెబుతోంది. పసిహృదయాలకు ఉండాల్సిన అమాయకత్వం మాయమై అవాంఛ నీయ పోకడలు ప్రవేశించి వారిలో విషబీజాలు నాటుతున్నాయి. తప్పుడు భావాలూ, అభిప్రా యాలూ వ్యాపిస్తున్నాయి. పిల్లల సంగతలావుంచి... పెద్దలే వాటి మాయలో పడి తప్పుడు నిర్ణ యాలు తీసుకుంటున్నారు. ఆర్థికంగా కలిగే నష్టం నేరుగా కనబడుతుంది. కానీ మానసికంగా అది కలగజేసే ప్రభావం లెక్కకు అందనిది. ఇప్పుడు ఏఐ సైతం వచ్చి ప్రమాద తీవ్రతను పెంచింది. పిల్లల ముచ్చట కాదనకూడదని కార్లు, టూ వీలర్లు అందించి కొందరు తల్లిదండ్రులు పరోక్షంగా వారి చావుకు కారణమవుతున్నారు. ప్రజలకు ముప్పు కలిగిస్తున్నారు. అందువల్ల సామాజిక మాధ్య మాల్లో పొంచి వుండే ప్రమాదాలపై ముందు తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలి. పిల్లల సంరక్షణకు ఇది తప్పనిసరి.

# బిసిలకు కాంగ్రెస్ భరోసా



హైదరాబాద్,కాంగ్రెస్ ఏడాది ప్రజాపాలనలో రాష్ట్రానికి వెన్నెముక లాంటి వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతివ్వడం గర్వంగా ఉంది. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బిసిలకు అన్నిరంగాల్లో న్యాయం జరిగేలా కాంగ్రెస్ సర్కారు చర్యలు చేపట్టింది. మొదటి ఏడాది పాలనలో ప్రభుత్వం బిసిల్లో భరోసా నింపడంతోపాటు, వారికి రాజకీయంగా మెరుగైన అవకాశాలు కల్పించేలా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో బిసిల స్థితిగతులపై లోతైన అవగాహన ఉన్న కాంగ్రెస్ ఎన్నికల ముందు వారికిచ్చిన హామీలను మొదటి ఏడాదిలోనే నెరవేరుస్తూ, పరిస్థితులకు అనుగుణంగా బిసిల అభివృద్ధికోసం మరిన్ని చర్యలు చేపట్టిన ఘనతను దక్కించుకుంది. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో లేనివిధంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రులుగా బిసి నేతలకు అధిక ప్రాధాన్యతిచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులుగా బిసి వర్గానికి చెందిన నన్ను ఎంపిక చేయడమే పార్టీకి బిసి వర్గంపట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత తమ బతుకులు బాగుపడుతాయని భావించిన బడుగు బలహీన వర్గాల ఆశలను వమ్ము చేసింది పదేళ్ల బిఆర్ఎస్ పాలన. తమ కుటుంబంలోని నలుగురి వ్యక్తుల చేతిలోనే రాష్ట్రాన్ని బంధీ చేసి పరిపాలించి, అన్ని రంగాలను వెనుకబాటుకు గురిచేసిన కెసిఆర్ వెనుకబడిన తరగతులపై వివక్ష చూపారు. బిఆర్ఎస్ హయాంలో బిసిల కష్టాలను గుర్తించిన కాంగ్రెస్ రాహుల్ గాంధీ మార్గదర్శకంలో అసెంబ్లీ ఎన్నికల ముందే బిసి వర్గాల్లో భరోసా నింపేలా 2023 నవంబర్ 10వ తేదీన కామారెడ్డిలో బహిరంగ సభ నిర్వహించి చారిత్రాత్మకమైన 'బిసి డిక్లరేషన్' ప్రకటించింది. శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ బిసిలకు 23 టికెట్లే కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 2 సీట్ల చొప్పున 34 మంది బిసిలను బరిలోకి దింపి వారికి రాజకీయ ప్రాధాన్యతిచ్చింది.స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంపు, కులగణన, బిసి కమిషన్ నివేదిక ఆధారంగా బిసిల రిజర్వేషన్ల పెంపు, బిసి సంక్షేమానికి భారీగా నిధుల కేటాయింపు, ఎంబిసి కులాల అభివృద్ధి కోసం చర్యలు, బిసి కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటు, బిసి యువత చిరువ్యాపారాలు చేసుకునేందుకు, వారు ఉన్నత విద్య అభ్యసించేందుకు రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందజేయడం, ప్రతి మండలంలో నవోదయ విద్యాలయాల స్థాయిలో బిసిలకు నూతన గురుకుల పాఠశాల ఏర్పాటు, 'వృత్తి బజార్' పేరిట ప్రతి మండలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు వంటి నిర్ణయాలను కామారెడ్డి 'బిసి డిక్లరేష్'లో ప్రకటించిన కాంగ్రెస్, కులగణనపై కూడా హామీ ఇచ్చింది.ఈ వాగ్దాలన్నింటినీ అమలు చేయడానికి మొదటి ఏడాదిలోనే అధిక ప్రాధాన్యతిచ్చి, వీటిలో చాలామటుకు పూర్తి చేసింది. మిగిలినవాటిని త్వరలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటూ బిసిలకు వెనుదన్నుగా నిలుస్తూ వారిలో విశ్వాసాన్ని కలిగించింది. మొదటి ఏడాది ప్రజాపాలనలోనే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటప్రకారం బిసిలకు ప్రాధాన్యతిస్తూ పలు చారిత్రాత్మక నిర్ణయాలను తీసుకుంది.రాష్ట్ర జానాభాలో 50 శాతానికి పైగా ఉన్న బిసిలకు జనాభా ప్రాతిపదికన అన్నిరంగాల్లో న్యాయం జరిగేలా రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తి చేసేందుకు వేగవంతంగా ముందుకు సాగుతూ, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సర్వే చేపట్టేందుకు స్ఫూర్తిగా నిలబడింది మా కాంగ్రెస్ సర్కార్. అంతేకాక బిసిలపై జరుగుతున్న దాడులను, అన్యాయాలను అరికట్టడానికి అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావాలనే డిమాండ్ వచ్చినా బిఆర్ఎస్ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తుంది.2024-25 బడ్జెట్లో రూ. 9200.32 కోట్లను బిసి సంక్షేమానికి కేటాయించింది కాంగ్రెస్.ఇవి బిఆర్ఎస్ ప్రభుత్వం అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులకన్నా రూ.2971.32 కోట్లు అధికం. బిఆర్ఎస్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 33% నుండి 23 శాతానికి తగ్గించి అన్యాయం చేశారు.బిఆర్ఎస్ చర్యలకు భిన్నంగా కాంగ్రెస్ 23 నుండి 42 శాతానికి పెంపుపై వేగవంతమైన చర్యలు తీసుకుంది. అందులో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడమే కాకుండా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో కమిటీని కూడా నియమించింది. ఈ రిజర్వేషన్ల పెంపుతో రాష్ట్రంలోని పంచాయతీలు, మున్సిపాల్టీల్లో కొత్తగా సుమారు 24వేల మంది బిసిలకు ప్రాతినిధ్యం దక్కే అవకాశాలుంటాయి. పదేళ్ల బిఆర్ఎస్ హయాంలో స్థానిక సంస్థల్లో బిసిలకు జరిగిన అన్యాయం తీర్చలేనిది. రిజర్వేషన్లు పెంచకుండా కెసిఆర్ సర్కార్ వారిని రాజకీయంగా అణిచివేసింది. బిఆర్ఎస్ తప్పులను సరిద్దుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా చర్యలు తీసుకుంటూ స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల అంశంలో ముందుకు సాగుతోంది. ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే కాంగ్రెస్ తెలంగాణ బిసి కమిషన్ ఏర్పాటు చేసి సభ్యులను నియమించింది. సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న బిసి కులాల కార్పొరేషన్లు, వెల్ఫేర్ బోర్డులను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసింది. ముదిరాజ్, యాదవ కుర్మ, మున్నూరు కాపు, పద్మశాలి, పెరిక, లింగాయత్, మేర, గంగపుత్ర సహకార సంఘాలను ఏర్పాటుచేసింది. అంతేకాక ఆర్థికంగా వెనుకబడిన తరగతుల ప్రత్యేక సంక్షేమ బోర్డును కూడా ఏర్పాటు చేసింది. బిసి కార్పొరేషన్‌ను 2024 ఆర్థిక సంవత్సరానికి రూ. 73 కోట్లు, ఎంబిసి కార్పొరేషన్కు రూ. 400 కోట్లు, బిసి కులాల కార్పొరేషన్, ఫెడరేషన్లకు 2024 -25 ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్ల చొప్పున కేటాయించి బిసి అభివృద్ధిపై తమకున్న నిబద్ధతను నిరూపించుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం.గీతన్నల కష్టాలను గుర్తించి వారి కోసం 'తాడి కార్పొరేషన్' ఏర్పాటు చేసి 'కాటమయ్య రక్షణ' కింద 10 వేల మందికి రక్షణ కిట్టుతోపాటు తగు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రజక, నాయీబ్రాహ్మణ కులాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ వారికి ఆర్థికంగా తోడ్పడింది ప్రభుత్వం.కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ పథకం కింద ఆర్థిక సాయం అర్హులకు అందేలా రాష్ట్ర అధికారులు వేగవంతంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కెసిఆర్ పాలనలో బడుగు బలహీన వర్గాల గురుకులాలు, హాస్టళ్లు వివక్షకు గురై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొన్న బాధలు వర్ణనాతీతం. ఏ రోజు ఎలాంటి ఇబ్బంది వస్తుందో భయాందోళనలతో విద్యార్థులు, ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందో అనే ఆందోళనలో వారి తల్లిదండ్రులు దినదిన గండంగా గడిపారు. అధికారంలోకి వచ్చిన తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, హాస్టళ్ల రూపురేఖలు మార్చాలని కంకణం కట్టుకొని చర్యలు ప్రారంభించింది. గత నెలలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కలతో సహా రాష్ట్రమంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ఉన్నతాధికారులు రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో, హాస్టళ్లలో, పాఠశాలల్లో పర్యటించి ఒక పండుగలా 'కామన్ డైట్' కార్యక్రమాన్ని నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన పోషకాహార మెనూను ప్రకటించారు. బిఆర్ఎస్ హయాంలో నామమాత్రంగా ఉన్న డైట్చార్జీలను 40%, కాస్మెటిక్ చార్జీలను 200% పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

# ఏపీలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,40,447

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో 2025 జనవరి 1 నాటికి తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏపీలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,40,447గా ఉందని ఎన్నికల సంఘం వెల్లడించింది. వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 2,10,81,814, పురుష ఓటర్లు 2,02,88,543 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు 66,690 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 3400 మంది ఉన్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 18-19 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లు 5,14,646 మంది ఉన్నారు. రాష్ట్రంలో 46,397 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 232 పోలింగ్ కేంద్రాలు పెరిగాయని పేర్కొంది.ఏపీలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి.. ఆ తుది జాబితా ప్రకారం ఏపీలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,40,447కు పెరిగింది.. అందులో పురుష ఓటర్ల సంఖ్య 2,03,52,816గా ఉండగా.. మహిళా ఓటర్ల సంఖ్య 2,10,84,231గా ఉంది.. ఇక, థర్డ్ జెండర్ ఓటర్ల సంఖ్య 3400గా ప్రకటించింది ఈసీ.. వెలగపూడి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి ఈ జాబితాను విడుదల చేశారు.. గతంలో పోలిస్తే పోలింగ్ స్టేషన్ల సంఖ్య 46,165 నుండి 46,397కి పెరిగింది. ముసాయిదా ఓటర్ల జాబితాలు గత ఏడాది అక్టోబర్ 29వ తేదీన ప్రచురించబడ్డాయి.. అయితే, అభ్యంతరాలను 28 నవంబర్ 2024 వరకు స్వీకరించామని.. అభ్యంతరాలకు పరిష్కారం చూపి, కొత్త ఓటర్లను చేర్చిన తర్వాత తుది ఓటర్ల జాబితాలు 6 జనవరి 2025న ప్రచురించినట్టు ఈసీ పేర్కొంది.. దీంతో.. గతంలో 2,02,83,021 ఉన్న పురుష ఓటర్ల సంఖ్య 2,02,88,543కి పెరగగా.. మహిళా ఓటర్ల సంఖ్య 2,10,67,377 నుంచి 2,10,81,814 చేరింది.. ఇక థర్డ్ జెండర్ ఓట్లు 3,394 నుంచి 3,400కి పెరగగా.. మొత్తం ఓటర్ల సంఖ్య 4,13,53,792 నుంచి 4,13,73,757 పెరిగినట్టు ఈసీ పేర్కొంది.. సర్వీస్‌లో ఉన్న పురుష ఓటర్లు 64,273.. మహిళా ఓటర్లు 2,417.. ఇతర సర్వీసుల్లో ఉన్న ఓటర్లలో పురుషులు 2,03,52,816 మంది.. మహిళా ఓటర్లు 2,10,84,231.. థర్డ్ జెండర్ 3,400గా ఉండడంతో.. మొత్తం ఓటర్ల సంఖ్య 4,14,20,935 నుంచి 4,14,40,447కి పెరిగినట్టు ఏపీ ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది ..

# ముక్కోటికి ఉత్తర ద్వార దర్శనం పవిత్రం

తిరుమల,ఈ ఏడాది ముక్కోటి ఏకాదశి జనవరి 10న వచ్చింది. ఆరోజున దాదాపు ప్రతి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. అంతే కాదు దగ్గరలో పుణ్య నదులు ఉంటే వాటిలో స్నానమాచరిస్తారు. అలా చేస్తే కోటి పుణ్యాల ఫలం దక్కుతుందని పురాణాలు చెబుతున్నాయి. సూర్య భగవానుడు ఉత్తరాయణ పుణ్య కాలానికి ముందు వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అంటారని పండితులు చెబుతున్నారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన తరువాత మకర సంక్రమణం మధ్యలో ముక్కోటి ఏకాదశి వస్తుంది. దీనినే వైకుంఠ ఏకాదశి అని కూడా అంటారు. ఆ రోజున అంటే జనవరి 10 వ తేదీన వైష్ణవ సంబంధ ఆలయాల్లో తెల్లవారుజామునే ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకుంటారు. ముక్కోటి ఏకాదశి రోజున న వేకువజామునే లేచి, తలారా స్నానం చేసి.. ఉత్తర ద్వారం గుండా వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. హిందువులు ఆధ్యాత్మికమైన విషయాల్లో చాలా శ్రద్ధ చూపుతారు. పండుగలకు.. విశేషమైన రోజులలో ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తారు. ఇక ఏకాదశి రోజుల్లో విష్ణు సంబంధమైన ఆలయాలను సందర్శిస్తారు. ఇక ముక్కోటి ఏకాదశి అంటే వేరే చెప్పనక్కరలేదు. పురాణాల ప్రకారం మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తుల కోర్కెలను తీరుస్తారు. అందుకే ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏరాదశులతో సమానమని పండితులు చెబుతారు. క్షీర సముద్రాన్ని మథించేటప్పుడు .. ఈ రోజునే హాలాహలం.. అమృతం పుట్టాయ ఆధ్యాత్మిక గ్రంథాల ద్వారా తెలుస్తుంది. పరమేశ్వరుడు.. హాలాహలం మింగి కంఠం దగ్గర ఉంచుకోగా... అమృతాన్ని దేవతలు అందరూ పంచుకున్నారు. అప్పటి నుంచి పరమేశ్వరుడి నీలకంఠేశ్వరుడు అని కూడా పిలవడం మొదలు పెట్టారు. విష్ణు పురాణం .. ప్రకారం.. మహా విష్ణువు ఆ రోజున వైకుంఠ ద్వారాలను తెరిచాడని పండితులు చెబుతున్నారు. ఇద్దరు రాక్షసులు.. మహా విష్ణువును దర్శించుకొనేందుకు ఎంతో కాలంగా ఆ ద్వారాల దగ్గర వేచి యున్నారట. ఆ రాక్షసులు పూర్వ జన్మలో చేసిన పాపాల వలన రాక్షసులుగా జన్మించారు. ఆ రాక్షసులు తమ పాపాలను నివృత్తి చేసి.. వైకుంఠ ప్రవేశం కల్పించాలని విష్ణుమూర్తిని కోరారు. అప్పుడు పుష్యమాసం ఏకాదశి రోజున వైకుంఠ ద్వారం తెరిచి.. వారికి ముక్తిని ప్రసాదించాడట. అందుకే ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు.

# రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై అక్రమంగా కేసు

హైదరాబాద్, కేవలం రాజకీయ కక్షతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తప్పుడు కేసులు పెడుతున్నదని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కె.కిశోర్ గౌడ్ ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేక పోవడంతో వారి ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలతో అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కిశోర్ గౌడ్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దుర్మార్గాలను ప్రజా క్షేత్రంలో తేల్చుకుంటామని, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేంతవరకూ కేటీఆర్ నాయకత్వంలో నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఎన్ని కేసులు పెట్టుకున్నా ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. కాగా, ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యహారంలో ఇప్పటికే ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యతంర ఉత్తర్వులను ఉపసంహరిం చుకున్నది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. దీనిపై నందినగర్‌లోని తన నివాసంలో తన లీగల్ టీమ్‌లో చర్చిస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులతో సమాలోచనలు చేపట్టారు.

# భూములు కోల్పోతున్న బాధితులకు పరామర్శ

మంచిర్యాల, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంచిర్యాలలో ప్రేమ్ సాగర్ రావు గుండాయిజం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని గుడిపేట, వేంపల్లి గ్రామ సరిహద్దులో సుమారు 276 ఎకరాలలో ఏర్పాటు చేయబో యే ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ప్రజల భూముల ను ఎలాంటి నోటిఫికేషన్లు, జీవోలు లేకుండా గుంజుకుంటున్నారని ఆరోపించారు. మంచిర్యాలలో మీడియాపై బహిరంగంగా స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు బెదిరింపులకు పాల్పడు తున్నాడు. కాంగ్రెస్ నాయకుల భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు నిర్మించాలని సవాల్ విసిరారు. పేద దళిత వర్గాలకు చెందిన రైతుల భూముల్లో ఎలా ఇండస్ట్రియల్ పార్క్ నిర్మిస్తారని ప్రశ్నించారు. రేవంత్ పాలనలో ఎస్సీలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో దళితుల భూములు కబ్జా చేస్తే ఊరుకునేది లేదని, బాధితుల వెంట కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, స్థానిక నేతలు ఉన్నారు.

# ప్రత్యేక రైళ్లు...

హైదరాబాద్,సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. కాచిగూడ/చర్లపల్లి నుంచి శ్రీకాకుళం రోడ్ మధ్య ఆరు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించింది. జనవరి 11, 12, 15, 16 తేదీల్లో కాచిగూడ - శ్రీకాకుళం రోడ్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. అలాగే, చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్డుకు 8, 9 తేదీల్లో రెండు రైళ్లు సర్వీసులందిస్తాయి. కాచిగూడ - శ్రీకాకుళం రోడ్ (07615) రైలు జనవరి 11, 15 తేదీల్లో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుంది. అలాగే, జనవరి 12, 16 తేదీల్లో శ్రీకాకుళం రోడ్ నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు కాచిగూడ చేరుకోనుంది. ఈ రైలు మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగనుంది. ఈ రైలులో అన్నీ థర్డ్ ఏసీ కోచ్‌లే. చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు (07617) జనవరి 8న చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకోనుంది. అలాగే, శ్రీకాకుళం రోడ్- చర్లపల్లి (07618) రైలు.. జనవరి 9న మధ్యాహ్నం 2.45 గంటలకు శ్రీకాకుళంలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ. శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగనుంది.

# మాజీమంత్రి వర్సెస్ ఎమ్మెల్సీ

అమరావతి,పేటకు నేనే మేస్త్రి. మురా మేస్త్రి. అంటూ ఆ ఇద్దరు నేతలు నియోజకవర్గ ఇంచార్జ్ కోసం పోటీ పడ్డారు. చిలకలూరిపేట వైసీపీ ఇంచార్జ్‌గా మళ్లీ మాజీమంత్రి విడదల రజినిని నియమించారు జగన్. దీంతో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తన దారి తాను చూసుకునేందుకు రెడీ అవుతున్నారట. ఆ మధ్య విడదల రజిని జనసేన వైపు చూస్తున్నారు..జంప్ అవుతారని ప్రచారం జరిగింది. ఇంతలోనే ఆమెను బుజ్జగించేందుకు తిరిగి చిలుకలూరిపేట నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించింది అధిష్టానం. ఆమెకు పెద్దపీట వేయడం నచ్చని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ హర్ట్ అయ్యారట.పార్టీ కోసం అన్నీ తానై నిలబడ్డ తనను కాదని..ఆమెకు టికెట్ ఇచ్చి..అమాత్య పదవి ఆచ్చారు. అయినా సరే అని ఊరుకున్నా. ఇప్పుడు మళ్లీ ఆమెకు బాధ్యతలు ఇచ్చారు. ఇక నేనెందుకు మరి ఇక్కడ ఉండి అంటూ..ఆగ్రహంతో ఉన్నారట మర్రి రాజశేఖర్. దాంతో మాజీమంత్రి వర్సెస్ ఎమ్మెల్సీ అన్నట్లుగా మారాయి చిలకలూరిపేట నియోజకవర్గం వైసీపీ పాలిటిక్స్. రజిని రీఎంట్రీపై రగిలిపోతున్న మర్రి రాజశేఖర్..ఇక వైసీపీలో ఉంటే లాభం లేదని ఫిక్స్ అయిపోయారట.

టికెట్ ఇస్తారో లేదోనని అలర్ట్

అధినేత మాటను కాదనలేక పార్టీలో ఉంటే..తనకు జరిగిన న్యాయం ఏంటంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారట. ఎలక్షన్ జరగడానికి ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆమెను తీసుకొచ్చి నియోజకవర్గ సమన్వయకర్తను చేస్తే..ఇక ఎన్నికలప్పుడు ఈక్వేషన్లు, సమీకరణాలు అంటూ..టికెట్ ఇస్తారో లేదోనని..అలర్ట్ అయిపోతున్నారట. ఎన్నాళ్లు వెయిట్ చేస్తామ్..జంప్ అయ్యే సమయం ఆసన్నమైందనుకుంటున్నారట.చిలకలూరిపేటలో వైసీపీకి మొదటి నుంచి మర్రి రాజశేఖర్ కీలక నాయకుడిగా ఉన్నారు. ఆయన 2004లో ఇండిపెండెంట్‌గా గెలిచి..వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌లో చేరిపోయారు. 2009లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడారు. జగన్ పార్టీ పెట్టాక ఆయన వెంట నడిచిన కొందరు నేతల్లో మర్రి రాజశేఖర్ ఒకరు. అలా వైసీపీలో మొదటి నుంచి ఉన్న నేతగా మర్రి రాజశేఖర్‌కు గుర్తింపు ఉంది. అయితే 2014లో జగన్ ఆయనకు చిలకలూరిపేట టికెట్ ఇచ్చినా గెలవలేకపోయారు.దాంతో మర్రి రాజశేఖర్‌ను కాదని..టీడీపీ నుంచి విడదల రజినికి 2019 ఎన్నికల్లో టికెట్ ఇచ్చారు జగన్. వైసీపీ ప్రభంజనం, బీసీ కార్డుతో రజిని గెలిచారు. ఇక 2024 ఎన్నికల నాటికి రజిని మంత్రి అయినా కూడా నియోజకవర్గంలో పూర్తి వ్యతిరేకత రావడంతో ఆమెను గుంటూరు వెస్ట్‌కు పంపించారు. అప్పుడు చిలకలూరిపేట టికెట్ ఆశించినా మర్రి రాజశేఖర్‌కు అవకాశం లభించ లేదు. 2019లో తన సీటు త్యాగం చేసిన మర్రి రాజశేఖర్‌ను ఎమ్మెల్సీని చేశారు. అంతేకాదు మంత్రిగా అవకాశం ఇస్తానని జగన్ బహిరంగ సభలో ప్రకటించారు. అయితే సామాజిక సమీకరణాలు నేపథ్యంలో అది జరగలేదు. పార్టీలో ప్రాధాన్యత ఇచ్చినా అమాత్య పదవి దక్కకపోవడంతో మర్రి అసంతృప్తిగానే ఉన్నారు. మొదటి నుంచి రజినిని వ్యతిరేకిస్తున్న మర్రి రాజశేఖర్ ఇప్పుడు మళ్లీ ఆమెను పేటకు తీసుకురావడంతో..పార్టీ నుంచి బయటికి వెళ్లిపోడానికే మొగ్గు చూపుతున్నారని చర్చ నడుస్తుంది. అయితే తనకు చిరకాల ప్రత్యర్థిగా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావుతో జతకడతారా లేక జనసేన వైపు వెళ్తారోనన్నది ఆసక్తికరంగా మారింది.

పవన్ ఒప్పుకోలేదని గుసగుసలు

ఎన్నికలు అయిపోయాయి. పార్టీ పరాభవం పాలైంది. మాజీమంత్రి విడదల రజిని కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఆమె సైలెంట్ అయిపోయారు. జనసేనలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేశారన్న ప్రచారం ఉంది. బాలినేని శ్రీనివాస్ ద్వారా జనసేన కండువా కప్పుకునేందుకు పావులు కదిపారని..పవన్ ఒప్పుకోలేదని గుసగుసలు వినిపించాయి.ఇంతలోనే అలర్ట్ అయిన జగన్ విడదల రజినిని బుజ్జగించారట.

# నిర్లక్ష్యం...ప్రాణాంతకం

న్యూఢిల్లీ,ప్రపంచంలోని మొత్తం వాహనాల్లో ఇండియాలో ఉన్నవి కేవలం ఒక్క శాతమే. కానీ, రోడ్డు ప్రమాదాల్లో 11శాతం మన దగ్గరే చోటుచేసుకుంటున్నాయి. దేశంలో ఏటా సుమారు అయిదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే, వాటిలో 1,50,000 మంది మరణిస్తున్నట్లు అంచనా. ఈ దుర్ఘటనల పట్ల ప్రజలను జాగరూకులను చేసేందుకు కేంద్రం ఈ నెలంతా 'జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం' పేరిట పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది.దేశంలోని రహదారుల పొడవు 64 లక్షల కిలోమీటర్లు. ఇందులో 1,46,145 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 1,86,528 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు ఉంటే, 60.78 లక్షల కిలోమీటర్ల మేర ఇతర రోడ్లు ఉన్నాయి. ఇక నమోదైన మొత్తం వాహనాల సంఖ్య 35.4 కోట్లు. తెలంగాణలో 1,10,000 కిలోమీటర్ల మేర రహదారులు ఉంటే, నిరుడు మే నాటికి 1.71 కోట్ల వాహనాలు నమోదయ్యాయి. ఇండియాలో గత దశాబ్ద కాలంలో సుమారు 15లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. గణాంకాలను పరిశీలిస్తే- దేశంలో రోజుకు 1,368 రోడ్డు ప్రమాదాలు అంటే దాదాపుగా నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం, ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మరణం సంభవిస్తున్నట్లు అర్థమవుతోంది. 2022లో 1,68,491 రోడ్డు ప్రమాద మరణాలు సంభవించగా, వాటిలో 61,038 (36.2శాతం) జాతీయ రహదారుల మీద, 41,132 (24.3శాతం) రాష్ట్ర రహదారులపైన చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాద బాధితుల్లో 40శాతం పాదచారులే ఉంటున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో...

ఆంధ్రప్రదేశ్‌లో 2023లో 18,597 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, 8136 మంది దుర్మరణం పాలయ్యారు. ఆ మరుసటి ఏడాదిలో 17,688 రహదారి ప్రమాదాల్లో 7,863 మంది ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణలోనూ ఇటువంటి పరిస్థితే నెలకొంది. ఇక్కడ 2023లో 20,903 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 7,186 మంది చనిపోయారు. నిరుడు 23,491 రహదారి ప్రమాదాల్లో 6,640 మంది అసువులు బాశారు. దేశంలో 30శాతం ఘోర రోడ్డు ప్రమాదాలకు 18-35 సంవత్సరాల యువ డ్రైవర్లే కారణమవుతున్నారు. వారి ప్రాణాలకు సైతం భద్రత లేకుండా పోతోంది. చోదకులు వాహనాలను నడుపుతూ సెల్‌ఫోన్లు ఉపయోగించడం వల్ల ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో 70శాతం ప్రమాదాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. 10శాతం ప్రమాదాలు రోడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, గుంతల వల్ల సంభవిస్తున్నాయి. 2022లో మొత్తం రోడ్డు ప్రమాద బాధితుల్లో 18-45 ఏళ్ల వయస్కులు ఏకంగా 66.5శాతం ఉండటం ఆందోళన కలిగించే విషయం. తెలంగాణలో ఇటీవల వెల్లడించిన కేసుల వివరాలు విస్తుగొలిపేలా ఉన్నాయి. ఏడాది కాలంలో సుమారు రెండు లక్షల మందికి పైగా వాహనదారులు సిగ్నల్ జంపింగ్ చేయగా, 1,96,788 మంది సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. మరో 78లక్షల మంది హెల్మెట్ ధరించకుండా, ఏడు లక్షల మంది అతి వేగంతో వెళ్తూ దొరికిపోయారు. కూడళ్లలో రెడ్ సిగ్నల్ పడినా, దాన్ని పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయేవారు సూసైడ్ బాంబర్లతో సమానం. ఎందుకంటే వారు ప్రాణాలు కోల్పోవడమో, గాయపడటమో జరగవచ్చు. లేదంటే ఇతరుల ప్రాణాలకు వారు హాని కలిగించవచ్చు.

కట్టడి సాధ్యమయ్యేనా?

దేశంలోని వివిధ విద్యాసంస్థల్లో సుమారు 31.5 కోట్ల మంది విద్యార్థులు



చదువుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 1.80 కోట్ల మంది విద్యార్థులున్నారు. రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయడం కోసం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నిర్వహించే రహదారి భద్రతా ఉత్సవాల్లో వీరందరినీ భాగస్వాములను చేయడం ఎంతో అవసరం. రహదారి ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి, వాటిని ఎలా నివారించవచ్చు అనే విషయాలను విద్యార్థులందరికీ తెలియజెప్పాలి. ఇందులో భాగంగా మొదట పాఠశాల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన బోధన సామగ్రి, కంటెంటును విద్యార్థులకు అందజేసే బాధ్యతను వారికి అప్పగించాలి. తరవాత ఈ అంశంపై క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, నినాదాల రచన వంటి పోటీలను నిర్వహించాలి. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల నుంచి ప్రెసిడెంట్, సెక్రటరీ, వాలంటరీలను నామినేట్ చేస్తూ రహదారి భద్రతా క్లబ్‌లను ఏర్పాటు చేయవచ్చు. రొటేషన్ పద్ధతిలో మొత్తం విద్యార్థులందర్నీ వీటిలో పాలుపంచుకునేలా చేయాలి. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేయడం ద్వారా వారిని ప్రోత్సహించాలి. అభివృద్ధి చెందిన దేశాల్లోని విద్యాసంస్థల్లో స్వచ్ఛంద సేవలకు మంచి గుర్తింపు ఉంటుంది. విద్యార్థిగా ఉన్నప్పుడు వాలంటరీ అనుభవాన్ని పొందితే అది జీవితానికి అవసరమైన ఎన్నో పాఠాలను నేర్పుతుంది.

మానవత్వం చూపించాలి...

రోడ్డు ప్రమాదాలకు ఇంజినీరింగ్ లోపాలు కూడా ప్రధాన కారణమే. వీటిని సరిదిద్దడం, నివారించడం ప్రభుత్వాల బాధ్యత. ముఖ్యంగా రోడ్డు రవాణా, రహదారుల శాఖ వీటిపై దృష్టి సారించాలి. రహదారి ప్రమాదాల నివారణకు పోలీసులు, పౌర సమాజ సంస్థల తోడ్పాటు కూడా చాలా అవసరం. క్షతగాత్రులను వీలైనంత త్వరగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. ఇందుకు ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో సగటున 14 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 31 నిమిషాలు పడుతోంది. చాలామందికి తెలియని విషయం ఏంటంటే- ప్రమాద బాధితులను 'గోల్డెన్ అవర్'లో సమీప ఆస్పత్రికి తరలించే వారికి రూ.5000 ప్రోత్సాహకంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రతి ఒక్కరూ మానవత్వంతో రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలించాలి. తద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ వాలంటరీ వ్యవస్థను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఇతోధికంగా తోడ్పాటు అందిస్తున్నాయి. దేశంలో రహదారి భద్రతా హీరోలను తయారు చేయడానికి, వారిని ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరింత కలిసికట్టుగా కృషి చేయాలి.

# మరో మహమ్మారి వైరస్?



న్యూఢిల్లీ,కరోనా మహమ్మారి విలయతాండవం సృష్టించి ఐదేళ్లు గడిచినా, ఇప్పటికీ ఆ పేరు వింటే చాలు వెన్నులోంచి వణుకు పుడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మహమ్మారి వైరస్ లక్షలాది మందిని కబళించింది. దీని బారినపడి బతికి బట్టకట్టినవారు ఉన్నా, దాని ప్రభావంతో ఇప్పటికీ పడరాని పాట్లు పడుతున్నారన్నది తోసిపుచ్చలేని నిజం. మళ్లీ అలాంటి వైరస్ ఒకటి వెలుగు చూసిందనీ, మానవాళిని తుదముట్టించేందుకు ముంచుకువస్తోందని తెలిస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడా పరిస్థితి ప్రజానీకానికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. కరోనా వైరస్‌కు పుట్టినిల్లయిన చైనాలోనే హెచ్ఎంపివి అనే కొత్తరకం వైరస్ పుట్టి, విస్తృతంగా వ్యాప్తి చెందుతోందని, దీని బారినపడిన జనం వేల సంఖ్యలో ఆస్పత్రులలో చేరుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా పోస్టవుతున్న వీడియోలను చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు.ఈ వైరస్ తాజాగా బెంగళూరులోను, అహ్మదాబాద్‌లోను వెలుగుచూసిందన్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. బెంగళూరులోని ఒక ఆస్పత్రిలో ఎనిమిది నెలలు, మూడు నెలలు వయసున్న ఇద్దరు పసికందులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, హెచ్ఎంపివి జాడలు బయటపడ్డాయని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ సంస్థ వెల్లడించింది. ఇండియాలోనే కాకుండా, అనేక దేశాల్లో జనావళి ఈ వైరస్ గురించి చర్చించుకోవడం, ఆందోళన చెందడం కొన్ని రోజులుగా జరుగుతోంది. ఇటీవల చైనాలోనూ, తాజాగా బెంగళూరు, అహ్మదాబాద్ నగరాల్లోనూ వెలుగు చూసిందని చెబుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్ఎంపివి) కోవిడ్ లా ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినదేమీ కాదు. దీని జాడలు 2001లోనే నెదర్లాండ్స్‌లో బయటపడ్డాయి. 2018లో ప్రపంచవ్యాప్తంగా ఆస్పత్రిపాలైన చిన్నారుల్లో మూడు నుంచి పది శాతం మంది హెచ్ఎంపివి బారిన పడినట్లు ఒక అధ్యయనంలో తేలింది. దీనిని బట్టి ఈ వైరస్ ప్రపంచానికి పాతదేనని స్పష్టమవుతోంది.అదిగో పులి అంటే ఇదిగో తోక అంటూ సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారహితంగా పోస్టులు పెట్టేవారి పుణ్యమాని హెచ్ఎంపివి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోతోంది. నిజానికి అనేక ఆసియా దేశాలకు ఇది శీతాకాలం. ఇన్‌ఫ్లూయెంజా, మైక్రోప్లాస్మా, నిమోనియా వంటి వ్యాధులు ప్రబలి, జలుబు, దగ్గు, ఇతర శ్వాసకోశ వ్యాధులతో జనం బాధపడటం సహజం. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలూ, పెద్దలూ త్వరితగతిన ఇలాంటి వ్యాధులకు లోనవుతూ ఉంటారు. కోవిడ్ వ్యాప్తి చెందిన తొలినాళ్లలో అవగాహన లేమివల్ల ప్రజలను అప్రమత్తం చేయడంలోనూ, సరైన నిరోధక చర్యలు చేపట్టడంలోనూ జరిగిన జాప్యం లక్షలాదిమంది ప్రాణాలను బలిగొనడానికి కారణమైంది. ఈ నేపథ్యంలో మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని తెలిస్తే, ఆందోళన చెందడం సహజం. అయితే, గత ఏడాదితో పోలిస్తే తమ దేశంలో హెచ్ఎంపివి కేసులు తగ్గాయంటూ చైనా గణాంకాలతోసహా పేర్కొంటూ ఉండగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఇప్పటి వరకూ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించకపోవడాన్ని బట్టి హెచ్ఎంపివి అంత ప్రమాదకరమైన వైరస్ కాదని తెలుస్తోంది. ఈ సూక్ష్మక్రిముల బారిన పడినవారు కోవిడ్ లాగానే శ్వాసకోశ వ్యాధులకు లోనవుతారని తెలినా, ఇప్పటివరకూ దీనికి వ్యాక్సీన్ కనిపెట్టకపోవడం వైద్య ఆరోగ్య శాఖ ఉదాసీన వైఖరికి ఉదాహరణ.చైనాలో హెచ్ఎంపివి కేసులు పెరుగుతున్నట్లుగా వస్తున్న వార్తలపై తక్షణమే స్పందించి, ప్రపంచ ఆరోగ్య సంస్థను వివరాలకోసం అడగడం భారత ప్రభుత్వం అప్రమత్తతను తెలియజేస్తోంది. దీనికి తోడు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ రంగంలోకి దిగి, జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించి, హెచ్ఎంపివి వ్యాప్తి, నివారణపై తీసుకోవలసిన చర్యల గురించి చర్చించింది. దేశవ్యాప్తంగా ఆరోగ్యశాఖాధికారులు పలు ప్రాంతాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నా రు. బెంగళూరులో హెచ్ఎంపివి వైరస్ సోకిన ఇద్దరు పసికందుల్లో ఒకరు ఇప్పటికే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కాగా, మరొకరిలో వ్యాధి తగ్గుముఖం పట్టిందన్న విషయం గమనార్హం. పైగా ఈ ఇద్దరికీ విదేశాల నుంచి వచ్చినవారివల్ల ఈ వైరస్ సోకలేదన్న ఆరోగ్య శాఖ ప్రకటనను బట్టి, కోవిడ్ మాదిరిగా హెచ్ఎంపివి ఇప్పటికిప్పుడు చైనా నుంచి దిగుమతైన వైరస్ కాదన్న సంగతి స్పష్టమవు తోంది.వ్యాధుల వ్యాప్తి అంతగా లేనప్పటికీ గత కోవిడ్ అనుభవా లను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎంపివి వ్యాప్తిని అరికట్టేందుకు చైనా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని అక్కడి అధికార మీడియా వెల్లడించడం ఊరట కలిగించే విషయం. ఏదిఏమైనా, హెచ్ఎంపివి వైరస్ జాడలు మన దేశంలోనూ బయట పడిన నేపథ్యంలో మరింత వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అవసరం. వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి, హెచ్ఎంపివి జాడ కనిపెట్టి, ఈ మహమ్మారిని మొగ్గలోనే తుంచేందుకు ప్రభుత్వాలు నడుం బిగించాలి. ప్రజలు వంతు బాధ్యతగా స్వీయ రక్షణ చర్యలు చేపట్టడం అత్యంత ఆవశ్యకం.

## గరికపాటిపై అభ్యంతరక ప్రచారాలు

హైదరాబాద్,ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన బృందం స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబసభ్యులతో పాటు అభిమానులను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. 'ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం.

# ఢిల్లీ ఎన్నికలకు మోగిన నగారా

న్యూఢిల్లీ,ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగుస్తుండటంతో ఆలోపే నూతన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు. ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు. ఈవీఎంల రిగ్గింగ్ సాధ్యం కాదని చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే తనకు చివరి ప్రెస్ మీట్ అని సీఈసీ చెప్పారు. ఓటింగ్ శాతంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంపై కూడా సీఈసీ స్పందించారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటలకు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు.

# కొనసాగుతుందా?

హైదరాబాద్,నెల రోజులుగా గాంధీభవన్‌లో ప్రజావాణి జరగడం లేదు. మంత్రులెవరూ గాంధీభవన్ దిక్కు చూడకపోవడంతో సమస్యలు చెప్పుకుందామని వస్తున్న కార్యకర్తలు, ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీంతో అసలు ఉన్నట్లుండి పార్టీ ఆఫీస్‌లో ప్రజావాణి కార్యక్రమం ఎందుకు ఆగిపోయిందన్న చర్చ జరుగుతోంది. గాంధీభవన్‌లో ప్రజావాణి కొనసాగుతుందా లేక ఎత్తేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ ఆఫీస్‌లో ప్రజావాణి కార్యక్రమం జరగకపోవడానికి రకరకాల కారణాలు ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది.పదేళ్ల తర్వాత పార్టీ పవర్‌లోకి ఉంది. పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారు. ప్రజలు కూడా ఎంతో నమ్మకంతో అధికారం కట్టబెట్టారు. అందుకే ప్రజలు, పార్టీ క్యాడర్ కోసం పీసీసీ తరపున ఒక కొత్త కార్యక్రమం చేయాలనుకున్నారు. అందులో భాగంగానే గాంధీభవన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.ప్రజాభవన్‌లో ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లే..క్యాడర్ కోసం పార్టీ ఆఫీస్‌లో ప్రజావాణి నిర్వహించి సమస్యలు సాల్వ్ చేయాలనుకున్నారు. ప్రతి బుధ, శుక్రవారం ఒక మంత్రి మూడు గంటల పాటు గాంధీ భవన్‌కు వచ్చి పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించేలా ప్రణాళిక రూపొందించింది పార్టీ. అంతేకాదు పదిహేను రోజులకు ఒకసారి సీఎం రేవంత్ రెడ్డి కూడా గాంధీభవన్‌లో నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని చెప్పింది పీసీసీ.

రెండు నెలల పాటు బాగానే జరిగి..

గతేడాది సెప్టెంబర్ 27న గాంధీభవన్‌లో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమం రెండు నెలల పాటు బాగానే జరిగింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని పార్టీ క్యాడర్, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.పార్టీ ఆఫీస్‌లో మంత్రులు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. అందుకు అనుగుణంగానే మంత్రులు వెంటనే సమస్యలను పరిష్కారమయ్యే దిశగా ఆదేశాలు జారీ చేస్తూ వచ్చారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు గాంధీభవన్‌లో ప్రజావాణిపై కొంత నమ్మకం పెరిగింది. కానీ సడెన్‌గా గాంధీభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం ఆగిపోవడం చర్చనీయాంశమ వుతోంది.నెల రోజులుగా గాంధీభవన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించకపోవడానికి కారణమేంటన్న చర్చ మొదలైంది. గతేడాది డిసెంబర్ 5 నుంచి ఇప్పటి వరకు అంటే దాదాపు నెల రోజులుగా మంత్రులెవరు గాంధీభవన్‌లో ప్రజావాణికి హాజరుకావడం లేదు. అయితే ప్రతి బుధవారం, శుక్రవారం ప్రజావాణి జరుగుతుందన్న నమ్మకంతో కార్యకర్తలు, ప్రజలు మాత్రం గాంధీభవన్‌కు వస్తున్నారు. తీరా వచ్చాక మంత్రులు లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. దాంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన ప్రజావాణి కార్యక్రమం ఇలా అర్ధాంతరంగా ఎందుకు ఆగిపోయిందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

బిజీ అయిపోయారా?

ఈ మధ్యకాలంలో మంత్రులు బిజీగా మారిపోయారని, అందుకే గాంధీభవన్ వైపు రావడం లేదని అంటున్నారు. మరోవైపు పీసీసీకి, మంత్రులకు సమన్వయ లోపం కనిపిస్తోందని, అందుకే మంత్రులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావడం లేదన్న చర్చ కూడా జరుగుతోంది. ప్రజావాణి కార్యక్రమాన్ని ముందుగానే షెడ్యూల్ చేసి, మంత్రులకు సమాచారం ఇవ్వడంలో సమస్య ఎదురవుతోందన్న టాక్ వినిపిస్తోంది.మంత్రులు కూడా ఎక్కువగా జిల్లాల పర్యటనలకు వెళుతుండటంతో గాంధీభవన్‌లో జరిగే ప్రజావాణికి సమయం ఇవ్వలేకపోతున్నారట. ఇక పదిహేను రోజులకు ఓ సారి ముఖ్యమంత్రి కూడా గాంధీభవన్‌లో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని ప్రకటించిన పీసీసీ, ఒక్కసారి కూడా సీఎం రేవంత్‌ని గాంధీభవన్‌కు తీసుకురాలేకపోయిందన్న విమర్శలు వస్తున్నాయి.ప్రజా ప్రభుత్వంలో గాంధీభవన్‌కు రండి, మీ సమస్యలు చెప్పుకోండని చెప్పిన కాంగ్రెస్ పార్టీ..ఇలా ఆల్ ఆఫ్ సడెన్‌గా ప్రజావాణి కార్యక్రమాన్ని నిలిపివేయడంపై అయితే ఆసక్తికర చర్చే జరుగుతోంది. రానున్న రోజుల్లో గాంధీభవన్‌లో ప్రజావాణి కొనసాగుతుందా.?

## విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి

జయశంకర్ భూపాలపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన కొత్తపల్లి (ఎస్ ఎం) గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివారలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాలుక రవి (50) అనే ఎలక్ట్రీషియన్ కరెంటు మోటార్ రిపేరు చేస్తూ విద్యుత్ షాక్‌తో మంగళవారం ఉదయం మృతి చెందాడు. గ్రామంలో మొరంచ వాగు వద్ద ఓ రైతు కరెంటు మోటార్ చెడిపోవడంతో రిపేరు చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

# షర్మిలకు రాజకీయ ఇంధనం మోడీ ఇస్తారా ?



అమరావతి,ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కొత్త ఏడాదిలో చేపట్టే తొలి పార్టీ కార్యక్రమానికి విశాఖను ఎంచుకున్నారు. విశాఖకు ఆమె ఈ నెల 10న రానున్నారు ఆ రోజున ఆమె కాంగ్రెస్ సిటీ ఆఫీసులో జై బాపూజీ, జై భీంజై సంవిధాన్ పోస్టర్ ని ఆవిష్కరిస్తారు. అనంతరం ఆమె విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మౌన నిరసన దీక్ష కూడా చేపడతారు. అని పార్టీ వర్గాలు తెలిపాయి. షర్మిల ఇటీవల కాలంలో పార్టీ యాక్టివిటీ ని పెద్దగా చేయడం లేదని అంటున్నారు.అయితే ఆమె విశాఖ నుంచే కాంగ్రెస్ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు అని అంటున్నారు. అంతే కాదు ఆమె విశాఖను ఎంచుకోవడం వెనక రాజకీయంగా కారణాలు ఉన్నాయని అంటున్నారు. విశాఖకు ఈ నెల 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నారు. ఆయన విశాఖలో భారీ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇష్యూ మీద మోడీ వైఖరి ఏంటి అన్నది ఈ సభ ద్వారా తేలనుంది.దాంతో ఆయన వెళ్ళిన మరుసటి రోజే షర్మిల విశాఖకు రావడంతో రాజకీయంగా కాంగ్రెస్ కి ఇంధనం దొరుకుతుంది అని అంటున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీని తీవ్రంగా ఎండగడుతూ ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ఏపీలో కూడా అదే పంథాను అనుసరిస్తోంది. ఈ క్రమంలో స్టీల్ ప్లాంట్ ని ప్రైవేట్ పరం చేయడం పట్ల కాంగ్రెస్ నిరసన తెలియచేస్తోంది. ఏపీకి ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు ఆయువు పట్టుగా ఉన్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేయవద్దు అని డిమాండ్ చేస్తోంది.ప్రధాని దాని మీద స్పష్టమైన ప్రకటన చేయకపోతే విశాఖకు వస్తున్న షర్మిల దాని మీద ఘాటుగానే రియాక్ట్ అయ్యే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. దాంతో ఆమె విశాఖ టూర్ ఆసక్తిని పెంచుతోంది. ఆ మధ్య కూటమి ప్రభుత్వం విద్యుతు భారాలు మోపిందని పేర్కొంటూ విజయవాడలో మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించిన షర్మిల ఇపుడు విశాఖ ఉక్కు మీద విశాఖ నుంచే ఏదైనా కార్యక్రమాన్ని ప్రకటిస్తారా అన్నది కూడా చర్చించుకుంటున్నారు. మొత్తానికి ప్రధాని సహా కూటమి నేతలు విశాఖను వేదికగా చేసుకుని ఏపీని ఫోకస్ చేయాలని చూస్తున్న వేళ షర్మిల కూడా అదే విశాఖను ఎంచుకోవడం మాత్రం కొంత చర్చకు తావిస్తోంది.

# స్థానిక ఎన్నికలపై రేవంత్ సర్కార్ బిగ్ ట్విస్ట్.. మే తర్వాతే ఎలక్షన్స్?

హైదరాబాద్,తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరగేలా కనిపించడం లేదు. ఫిబ్రవరి మొదటి వారంలో కాంగ్రెస్ సర్కార్ ఎన్నికలకు వెళ్లాలని ప్లాన్ చేసింది. కానీ బీసీ రిజర్వేషన్ల అంశం, పంచాయతీ రాజ్ చట్టంలోని మార్పుల వలన మరింత ఆలస్యం కానున్నట్టుగా తెలుస్తోంది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరగవా అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. రైతు భరోసా, ఇతర పథకాల అమలు తరువాత అంటే ఫిబ్రవరి మొదటివారంలో కాంగ్రెస్ సర్కార్ ఎన్నికలకు వెళ్లాలని ప్లాన్ చేసింది. కానీ ఇప్పుడు బీసీ రిజర్వేషన్ల అంశం వల్ల ఎన్నికలు మే లేదా జూన్ లో జరగవచ్చు అని తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 22 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉంది. అయితే ఇచ్చిన హామీ మేరకు 42 శాతానికి పెంచితే రిజర్వేషరన్లు 50 శాతానికి మించుతాయి. రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పు దానికి అడ్డుగా మారుతుంది. జనభా మేరకు రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింంది. కులగణనను కూడా కంప్లీట్ చేసింది. ఆయా లెక్కల ప్రకారం బీసీల రిజర్వేషన్ల శాతాన్ని ఖరారు చేస్తూ బీసీ కమిషన్ తుది నిర్ణయం తీసుకోవాలి. అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు పంపిస్తే దానికి అనుగుణంగా ఈసీ నోటిఫికేషన్ జారీచేస్తుంది. అనంతరం 21 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను కంప్లీట్ చేయాలి.దీనికి తోడు గత బీఆర్ఎస్ సర్కార్ .. అమల్లోకి తెచ్చిన పంచాయతీ రాజ్ చట్టం-2018 అమలుపై సందిగ్ధం నెలకొంది.

నోటిఫికేషన్ కోసం ఎదురుచూపు



ఈ చట్టంలో ఏమైనా మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశముందని తెలుస్తోంది. ఇదంతా ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. దీంతో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా అని ఎంతో ఆతృతగా వెయిట్ చేస్తున్న ఆశావహుల ప్రయత్నాలపై నీళ్లు చల్లినట్లయింది. గత 8నెలలుగా ప్రజల మధ్య ఉండి.. స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న వీరికి నిరాశే మిగిల్చినట్లు అవుతుంది. ఒకవేళ ఇవన్ని మార్చిలోపు కంప్లీట్ చేసిన ఆ తరువాత టెన్త్ , ఇంటర్, డిగ్రీ, ఎంట్రెన్స్ పరీక్షలు జరుగుతాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీచర్లు విధులు నిర్వహించాల్సి ఉంటుంది కాబట్టి మే మొదటి వారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తే జూన్ వరకు పూర్తి చేయవచ్చు అని ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

# కేసీఆర్ రంగంలోకి దిగాల్సిందేనా ?

హైదరాబాద్‌కసీఆర్ అంటేనే ఒక పొలిటికల్ వైబ్రేషన్. ఏ చిన్న అవకాశం ఉన్నా చొచ్చుకుని పోయే రాజకీయ దూకుడు ఆయన సొంతం. అయితే కేసీఆర్ లోని ఈ దూకుడుని చూసి చాలా కాలం అయింది అని అంటారు. ఆయన 2014లో సీఎం అయ్యాక కాస్తా రిలాక్స్ అయ్యారని చెబుతారు. ఇక 2018లో ముందస్తు ఎన్నికల సమయంలో ఆయన ప్రచారంలో కొత్త వ్యూహాలు రచించారు. 2023లో మాత్రం ఆయన వ్యూహాలు అయితే పెద్దగా ఫలించలేదు. గత పదేళ్ళుగా చూస్తే కనుక ఎన్నికల సమయంలో తప్ప కేసీఆర్ పెద్దగా కనిపించింది తక్కువ అని అంటారు. పార్టీ సైతం అధికారంలో ఉండడంతో కేసీఅర్ కి పెద్దగా పని లేకుండా పోయిందని అంటున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే బీఆర్ఎస్ కి 2023 ఎన్నికలు చేదు ఫలితాలు ఇచ్చాయన్న సంగతి తెలిసిందే.మాజీ సీఎం గా కేసీఅర్ మిగిలిపోయారు. ఆయన ఈ ఓటమి తరువాత పెద్దగా అయితే కనిపించడం లేదు అని అంటున్నారు. ఆయన ఎక్కువగా ఎర్రవల్లిలోని ఫాం హౌస్ లోనే ఉంటున్నారు అని ప్రచారం సాగింది. ఇదిలా ఉంటే కేసీఆర్ ఇపుడు రంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైంది అని అంటున్నారు.బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఅర్ బీఆర్ఎస్ ని గత ఏడాది కాలంగా నడిపిస్తున్నారు. ఆయనతో పాటు మేనల్లుడు హరీష్ రావు కూడా పార్టీకి అండగా ఉన్నా ఫోకస్ అంతా కేటీఆర్ మీదనే ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. అటువంటిది కేటీఆర్ ఇపుడు కేసులను ఎదుర్కొంటున్నారు.కేటీఆర్ ఫార్ములా ఈ కారు రేసు కేసులో అరెస్ట్ అవడం కచ్చితమని అంటున్నారు. దానికి మానసికంగా బీఆర్ఎస్ అగ్ర నేతలు సిద్ధమైపోయారు అని అంటున్నారు. ఇక ఈ కేసులో కేటీఆర్ ని ఏసీబీ అరెస్ట్ చేస్తే బయటకు బెయిల్ పై బయటపడడానికి ఏ విధంగా చేయవచ్చు దానికి తీసుకునే టైం ఎంత వరకూ ఉంటుంది అన్నది అయితే ఈ రోజుకు తెలియదు అని అంటున్నారు.కేటీఆర్ కొంతకాలం పాటు జైలులోనే ఉంటే అపుడు బీఆర్ ఎస్ పరిస్థితి ఏంటి అన్నది చర్చకు వస్తోంది. ఇక దీని మీదనే బీఆర్ఎస్ అగ్రనాయకత్వంలో కూడా చర్చలు సీరియస్ గానే సాగుతున్నట్లుగా చెబుతున్నారు. కేటీఆర్ కనుక జైలుకు వెళ్ళాల్సిన పరిస్థితి వస్తే బాధ్యతలను మరో కీలక నేతగా ఉన్న హరీష్ రావుకు అప్పగిస్తారు అని కూడా ప్రచారంలో ఉంది.అంతే కాదు కుమార్తె కవిత కూడా ఈ బాధ్యతలను తీసుకుంటారు అని కూడా అంటున్నారు. అయితే ఇవన్నీ కాదని ఏకంగా కేసీఆర్



నే బయటకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మీద తనదైన శైలిలో రాజకీయ పోరాటం చేస్తారు అని అంటున్నారు.ఇప్పటికే తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదమూడు నెలలు అయింది. ఒక విధంగా ప్రభుత్వం పాత పడింది. గతంలో ఉన్న ఆశలు ఆకాంక్షలు జనంలో కూడా తగ్గుముఖం పడుతున్నాయి. కరెక్ట్ గా ఇదే సమయంలో డైవర్షన్ పాలిటిక్స్ కి కాంగ్రెస్ ప్రభుత్వం తెర తీసిందని అంటున్నారు.అందులో భాగనే కేటీఆర్ అరెస్ట్ అని అంటున్నారు. దాంతో ఇక పూర్వం మాదిరిగా కేసీఆర్ ని చూస్తారని బీఆర్ఎస్ నుంచి గట్టిగా వినిపిస్తున్న మాట. కేసీఆర్ ఇపుడు బయటకు వచ్చి గులాబీ దళానికి నాయకత్వం పూర్తి స్థాయిలో వహించడమే కాకుండా డైరెక్ట్ ఫైట్ కి రెడీ అవుతారు అని అంటున్నారు.అంటే ఇప్పటిదాకా తెలంగాణా రాజకీయ తెర మీద చూడని సరికొత్త సన్నివేశాన్ని చూడబోతున్నారని అంటున్నారు. రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్న ఎపిసోడ్ పొలిటికల్ గా వెరీ ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. అంతా దాని కోసం చూస్తున్నారు. కేటీఆర్ ఉండగా ఆయన మీద బాధ్యతలు వదిలేసి కేసీఅర్ కాస్తా దూరం పాటించారు.ఇపుడూ వారూ వీరూ కాదు నేనే సీన్ లోకి వస్తాను అని కేసీఆర్ అంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేసీఅర్ ఒకే ఒకసారి అసెంబ్లీకి వచ్చారు. అంతే కాదు మీడియా సమావేశాలను పెద్దగా పెట్టింది లేదు. ఇపుడు డైలీ పాలిటిక్స్ లోకి ఆయన దిగితే కనుక ఇక తెలంగాణా పాలిటిక్స్ వేరే రేంజిలోకి చేరుకుంటాయని అంటున్నారు. మొత్తం మీద కొద్ది రోజుల వ్యవధిలోనే తెలంగాణాలో రాజకీయ సమీకరణలు మారబోతున్నాయి అని అంటున్నారు.

# నల్లమల అడవుల్లో భూగర్భ సొరంగం



అమరావతి: గోదావరి- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా నల్లమల అడవుల్లో భూగర్భ టన్నెల్‌ను ప్రతిపాదిస్తున్నారు. బొల్లాపల్లి జలాశయంలో నీళ్ల నిల్వ చేసిన తర్వాత, అక్కడి నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీళ్లు తీసుకువెళ్లేందుకు నల్లమల అడవుల మీదుగా మళ్లించాల్సి ఉంటుంది. అటవీ, పర్యావరణ అనుమతులు సులభంగా సాధించేందుకు వీలుగా అండర్ టన్నెల్ నిర్మాణం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈ మార్గంలో 24 వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకువెళ్లేందుకు వీలుగా 118 కి.మీ పొడవున గ్రావిటీ కాలువ తవ్వుతారు. ఇందులో భాగంగా మూడుచోట్ల నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. దీంతోపాటు టన్నెల్ నిర్మాణమూ అవసరమవుతుంది. నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు 27 కి.మీ. పొడవున టన్నెల్ తవ్వుతారు. ఇది వన్యప్రాణి అటవీ సంరక్షణ ప్రాంతం కావడంతో ఈ టన్నెల్‌ను భూగర్భంలో తవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. ఈ టన్నెల్ ప్రారంభం, ఆ తర్వాత వెలుపలికి నీళ్లు వచ్చే ప్రాంతం కూడా అటవీ ప్రాంతంలో లేకుండా ప్రణాళిక సిద్ధం చేశారు. అటవీ ప్రాంతం అంతా భూగర్భంలోనే నీళ్లు ప్రవహిస్తాయి. ఈ టన్నెల్ కోసం 17 వేల ఎకరాల అటవీ భూమి అవసరమని లెక్కిస్తున్నారు. ఇందులో బొల్లాపల్లి జలాశయంలోనే 15 వేల ఎకరాలు కావాలి.

### తొలి భాగంలో ఎత్తిపోతల అక్కర్లేదు

పోలవరం జలాశయం నుంచి కృష్ణా నది వరకు నీటిని తీసుకువెళ్లే మార్గంలో ఎక్కడా నీటిని ఎత్తిపోయాల్సిన అవసరం లేదు. ప్రస్తుతమున్న కాలువల సామర్థ్యం పెంచుకుంటే సరిపోతుంది. పోలవరం కుడి కాలువ ఇప్పటికే 187 కి.మీ. మేర తవ్వి ఉంది. 17,800 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో నిర్మించిన ఈ కాలువను 28 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచేలా వెడల్పు చేస్తారు. దీంతోపాటు ప్రస్తుతం గోదావరి వరద జలాలను ఉమ్మడి పశ్చిమగోదావరికి అందిస్తున్న తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువలు ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరిలో 80 కి.మీ. పొడవున ఉన్న ఈ ప్రధాన కాలువను మరో 108 కి.మీ. మేర పొడిగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 1,400 క్యూసెక్కులున్న కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచేలా వెడల్పు చేస్తారు. ఆ కాలువలపై అవసరమైన కట్టడాలు నిర్మించాలి.

### అనుమతులు ఎలా?

కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్న నేపథ్యంలో అనుమతులు పెద్ద కష్టం కాకపోవచ్చనే అభిప్రాయం ఉంది. అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా భూములు చూపాల్సి ఉంటుంది. మరోవైపు కేంద్ర జలసంఘానికి డీపీఆర్ సమర్పిస్తారు. ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా దిగువన పోలవరం ప్రాజెక్టు నుంచి వరద జలాలే తీసుకుంటున్నందున అనుమతులు పెద్ద కష్టం కావని జలవనరులశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్టుకు దాదాపు 5,000 మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుంది. ఏటా ప్రాజెక్టు నిర్వహణకు విద్యుత్తు రూపంలోనే రూ.వేల కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇది అన్నింటి కన్నా పెద్ద సవాల్.

# మాజీ మంత్రి కాకాణికి కేసు షాక్..



అమరావతి,అధికారంలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడినా నడిచిపోతుంది. అలా అని.. అధికారం చేతిలో లేనప్పుడు.. ఎంత తోపు అయినా నోరు జారితే తిప్పలే ఎదురవుతాయన్న విషయాన్ని వైసీపీ నేతలు ఎందుకు గుర్తించటం లేదు? ఐదేళ్లు తాము అధికారంలో ఉన్నప్పుడు విపక్షాలు.. ఆయా పార్టీల నేతలు కాస్త తేడాగా మాట్లాడినా.. కొన్నిసార్లు మాట్లాడకున్నప్పటికి కేసులతో బుక్ చేసిన వైనాన్ని వారెందుకు మర్చిపోతున్నారు. తాము చేసిన పనిని తమ రాజకీయ ప్రత్యర్థులు అదే తీరుతో ఉంటారన్న సోయి వారిలో ఎందుకు మిస్ అవుతుంది?అలాంటి విషయాల్ని మర్చిపోయిన వారందరికి కేసులతో షాకులు ఎదురవుతున్నాయి. తాజాగా ఆ జాబితాలో చేరారు ఏపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి. ఆయనపై నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీస్ సటేషన్ లో కేసు నమోదైన విషయం చాలా ఆలస్యంగా బయటకు వచ్చింది. డిసెంబరు 27న కేసు నమోదైతే.. ఆ విషయం జనవరి ఆరున కానీ బయటకు రాలేదు. దీంతో కాకాణి వర్గీయులు షాక్ కు గురవుతున్నారు. వెంకటాచలం మండలానికి చెందిన ఒకరు ఇచ్చిన కంప్లైంట్ తో పోలీసులు కేసు నమోదు చేసినట్లుగా చెబుతున్నారు.ఇంతకూ కేసు నమోదు చేసేంత పని కాకాణి ఏం చేశారన్నప్పుడు.. చాలానే విషయాలు చెప్పుకొచ్చారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు.. కాకాణికి ముఖ్య అనుచరుడిగా ఉన్న వెంకట శేషయ్యపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఒక మహిళ తనను శేషయ్య వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయటంతో ఆయనపై కేసు నమోదు చేశారు. అనంతరం అదుపులోకి తీసుకొని కోర్టు ఎదుట హాజరుపర్చగా.. ఆయనకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలుజారీ చేశారు.తన ప్రధాన అనుచరుడి రిమాండ్ నేపథ్యంలో మాజీ మంత్రి కాకాణి రగిలిపోయారు. మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఆయన.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వెంకటాచలం సీఐ సుబ్బారావు ఖాకీ దుస్తులు ఊడదీసి.. శాశ్వితంగా పచ్చచొక్కా వేసుకొని చంద్రబాబు.. లోకేశ్.. టీడీపీ లీడర్ల చుట్టూ తిరగాల్సిందేనని వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగని ఆయన సీఐను శాశ్వితంగా విధుల నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీఐతో పాటు వెంకటాచలం ఆర్ఐ రవిపైనా ఇదే రీతిలో వ్యాఖ్యలు చేశారు. దీంతో.. పోలీసులను, అధికారులను మాజీ మంత్రి బెదిరింపులకు దిగినట్లుగా పేర్కొంటూ ఆయనపై ఒకరు ఫిర్యాదు చేయగా.. మాజీ మంత్రిపై కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ వ్యవహారం ఇంకెంత దూరం వెళ్లనుందన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## మోడీ పర్యటన సందర్భంగా భారీగా ఏర్పాట్లు

విశాఖపట్నం,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రానున్నారు. విశాఖలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం బహిరంగ సభ, రోడ్ షో ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించి అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు సైతం భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభా ఏర్పాటుకు సంబంధించి పనులు చకాచకా సాగుతున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు సభా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ..'కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించిన తర్వాత తొలిసారిగా విశాఖకు ప్రధాని మోదీ వస్తున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి అయ్యాయి. భద్రతాపరంగా ఎటువంటి ఇబ్బందులూ రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొన్ని లక్షల కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఇదంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధాని ఇస్తున్న బహుమతి. అందుకు ప్రతిఒక్కరూ మోదీకి అభినందలు తెలియజేయాలి. ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలందరూ ఆశీర్వదించాలి. రేపు నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని' కోరారు.విశాఖపట్నానికి బుధవారం వస్తున్న ప్రధాని మోదీ ఏకంగా రూ. 2 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. విశాఖపట్నం సమీపం పూడిమడక వద్ద జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ కింద మొదటి

# కొరకరాని కొయ్యగా బైడెన్ నిర్ణయాలు

వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షుడిగా తన చివరి సమయంలో తీసుకున్న అధికారిక నిర్ణయాలు, చర్యలతో పరిపాలనను, అధికార బదిలీని కష్టతరం చేశారని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. తాను అధికారం స్వీకరించడానికి ముందే ఎన్ని కష్టతరమైన మార్పులు సాధ్యమో అన్నీ చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయవ్యవస్థలో ఇలా జరగడం మునుపెన్నడూ చూడలేదని పేర్కొన్నారు. ఖరీదైన, అర్థంలేని పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చి గ్రీన్ న్యూ స్కామ్, ఇతర రకాలుగా డబ్బును వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఉత్తర్వుల విషయంలో అమెరికా ప్రజలు భయపడాల్సిన పనిలేదని, తాను అధికారం చేపట్టగానే వాటిని తొలగిస్తానన్నారు. తన పరిపాలనలో అమెరికాను మరింత శక్తివంతమైన దేశంగా నిలబెడతానన్నారు. ఇప్పటికే తాము రూపొందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ ద్వారా ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా అమెరికా తీర ప్రాంతంలో చమురు, సహజవాయువు కోసం చేసే డ్రిల్లింగ్‌ను బైడెన్ నిషేధించారు. కాలిఫోర్నియా, ఒరెగాన్, తూర్పుగల్ఫ్ ఆఫ్ మెక్సికో మొదలైన ప్రదేశాల్లో 625 మిలియన్ ఎకరాల తీర ప్రాంతంలో ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్‌లు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దేశీయ ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తామని వాగ్దానం చేసిన ట్రంప్ ప్రమాణస్వీకారం చేయడానికి కొద్ది రోజుల ముందు బైడెన్ ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికను అమెరికా కాంగ్రెస్ సోమవారం లాంఛనంగా ధ్రువీకరించింది. గొప్ప ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని కాంగ్రెస్ ధ్రువీకరించడం చరిత్రలో పెద్ద పరిణామమని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్‌పై పోటీచేసి ఓడిపోయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆయన విజయాన్ని ధ్రువీకరించే లాంఛనప్రాయ క్రతువుకు అధ్యక్షత వహించారు. అధికార బదలాయింపు శాంతియుతంగా జరిగేలా చూడడం తన పవిత్ర కర్తవ్యమని ఆమె ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ఎంతటి సున్నితమైనదో చూస్తున్నామని, అధికార మార్పిడి సాఫీగా పూర్తయ్యేందుకు అందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు.అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వీలైనన్ని ఇబ్బందులు సృష్టించే పనిలోపడ్డారు ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్. తాజాగా ట్రంప్ లక్ష్యమైన గ్యాస్, చమురు డ్రిల్లింగ్ పనులు ముందుకువెళ్లకుండా ఆయన ఏకంగా 75 ఏళ్ల నాటి ఓ చట్టాన్ని తెర పైకి తీసుకొచ్చారు. అమెరికా సముద్ర జలాల్లో దాదాపు 62 కోట్ల ఎకరాల ప్రదేశాన్ని ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి కాపాడేందుకు దీనిని వాడనున్నారు. ఈ విషయాన్ని సోమవారం శ్వేతసౌధం ప్రకటించింది. శిలాజ ఇంధన ఉత్పత్తిని పెంచాలన్న ట్రంప్ ప్లాన్ అమలును ఇది మరింత జఠిలం చేయనుంది. 1953 ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్ ల్యాండ్ యాక్ట్ ఇందుకోసం బైడెన్



వాడుతున్నారు. దీని ప్రకారం చమురు, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్‌ను పూర్తిగా మినహాయించే అధికారం అధ్యక్షుడికి లభిస్తుంది. తూర్పు, పశ్చిమతీరాలు, తూర్పు గల్ఫ్ మెక్సికో, అలాస్కాలోని ఉత్తర బేరింగ్ సముద్రం వంటివి వీటి కిందకు వస్తాయి. అంతేకాదు.. అసలు ఈ చట్టం తర్వాత వచ్చే అధ్యక్షుడికి దానిని అడ్డుకొనే శక్తిని ఇవ్వదు. దీనిని ఆపాలంటే ట్రంప్ మళ్లీ కాంగ్రెస్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. 'తాజాగా వారు అనుకొన్నచోట్ల డ్రిల్లింగ్ చేస్తే.. కోలుకోలేనంత నష్టం వాటిల్లుతుంది. వాస్తవానికి అమెరికా ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి అది అనవసరం. రిస్క్ చేయాల్సినంత విలువైందేమీ కాదు. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాలను వాతావరణ మార్పులు ప్రభావితం చేస్తున్నాయి. మనం క్లీన్ ఎనర్జీ ఆర్థికవ్యవస్థ దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ తీరాలను మన పిల్లలు, మనవళ్ల కోసం సంరక్షించి తీరాల్సిందే. కాలిఫోర్నియా నుంచి ఎలోరిడా వరకు రిపబ్లికన్లు, డెమోక్రట్ గవర్నర్లు, కాంగ్రెస్ సభ్యులు, తీరప్రాంత ప్రజలు ఏకతాటిపైకి వచ్చి చమురు, సహజవాయు డ్రిల్లింగ్ నుంచి తీరాలను రక్షించడానికి ఏకతాటి పైకి రావాలి' అని జోబైడెన్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ కార్యవర్గంలోని ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించనున్న కరోలైన్ లెవిట్టీ స్పందిస్తూ.. దీనిని అమెరికా ప్రజలపై అవమానకర ప్రతీకార చర్యగా పేర్కొన్నారు. చమురు వెలికితీతలో బైడెన్ విఫలమయ్యారని అభివర్ణించారు.

## గ్రీన్‌కో కార్యాలయంలో ఏసీబీ సోదాలు

హైదరాబాద్,మాదాపూర్‌లోని గ్రీన్‌కో కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తున్నది. మంగళవారం ఉదయం నుంచి ఈ సోదాలు కొనసాగుతున్నాయి. గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీ కార్యాలయాల్లోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com